# అతి పెద్ద ప్రజారోగ్య సమస్యగా క్యాన్సర్ వ్యాధి విస్తరణ !

("ప్రపంచ క్యాన్సర్ దినం" సందర్భంగా)

ఖచ్చితమైన చికిత్స అందుబాటులో లేని కారణంగా క్యాన్సర్ వ్యాధితో పెద్ద సంఖ్యలో రోగులు మరణించడం ఒక ప్రపంచ ప్రజారోగ్య సమస్యగా మారింది. శరీరంలోని ఏ భాగానికి చెందిన కణజాలమైనా నియంత్రణ లేకుండా అపరిమితంగా పెరగడంతో ట్యూమర్స్ ఏర్పడడంతో పాటు ఇతర శరీర కణజాలాలు కూడా విధ్వంసం చేయబడడాన్ని క్యాన్సర్ అని అర్థం చేసుకోవాలి. నాన్-కమ్యూనికబుల్ వ్యాధుల్లో గుండె జబ్బుల (63.3 శాతం) తర్వాత 2వ అత్యధిక మరణాలకు కారణం అవుతున్న క్యాన్సర్ (18.1 శాతం) ఒక ప్రపంచ స్థాయి సమస్యగా గుర్తించబడింది. అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో దినదినం పెరుగుతున్న క్యాన్సర్ కేసులు మన ప్రజారోగ్య విభాగాలకు సవాళుగా నిలుస్తున్నాయి. క్యాన్సర్లలో వందకు పైగా రకాలు ఉన్నప్పటికీ ఊపిరితిత్తులు, రొమ్ము, గర్భాశయ, ప్రోస్టేట్, చర్మం, జీర్ణనాళ క్యాన్సర్లు అతి ముఖ్యమైనవి. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా కనిపిస్తే, పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ మహిళలు, పురుషుల్లో కూడా ఎక్కువగానే కనిపిస్తుంది. పిల్లల్లో (బాలలు, బాలికలు) లింఫోయిడ్ ల్యుకేమియా(రక్త) క్యాన్సర్ అధికంగా కనిపిస్తున్నది.

## ప్రపంచ క్యాన్సర్ దినం-2025:

ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి పట్లు సంపూర్ణ అవగాహన కల్పించడానికి, నివారణ మార్గాలు, చికిత్స మార్గాలు, రోగ లక్షణాలు లాంటి అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏట 04 ఫిబ్రవరి రోజున "ప్రపంచ క్యాన్సర్ దినం" నిర్వహించుట 2000 సంవత్సరం నుంచి ప్రారంభం అయ్యింది. ప్రపంచ క్యాన్సర్ దినం-2025 ఇతివృత్తంగా "యునైటెడ్ బై యూనిక్(ప్రత్యేకమైన ఐక్యతతో క్యాన్సర్ కట్టడి పోరాటం)" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడడం, క్యాన్సర్ రోగాన్ని తొలి దశలో గుర్తించి వైద్య చికిత్సలు పొందడం, క్యాన్సర్ వ్యాధి లక్షణాలు లాంటి అంశాలను ప్రపంచ మానవాళికి చేర్చడానికి విశ్వవ్యాప్తంగా ఐక్య పోరాటం చేయడమే ఉత్తమ మార్గమని నిర్ణయించడం సముచితంగా ఉన్నది.

క్యాన్సర్ కారణాలు, రోగ లక్షణాలు, చికిత్స మార్గాలు:

క్యాన్సర్ వ్యాధి రావడానికి ముఖ్య కారణాలుగా జన్యు మార్పులు, అనువంశిక మార్గాలు, పొగ తాగడం, అధిక ఆల్కహాల్ సేవనం, స్థూలకాయం, పర్యావరణ కాలుష్యం, ప్రమాదకర రసాయనాలతో పని చేయడం, రేడియోషన్‌కు గురి కావడం, ప్రాసెస్డ్ ఫుడ్, శారీరక వ్యాయామం కొరవడడం, నిశ్చల జీవనశైలి, ఆలస్యంగా గుర్తించడం, అవగాహన లోపం, పేదరికం, సూర్యకిరణాల్లో అతినీలలోహిత కిరణాలకు గురి కావడం లాంటివి పేర్కొనబడినవి. క్యాన్సర్ వ్యాధి రోగ లక్షణాల్లో గడ్డలు లేదా ట్యూమర్స్ ఏర్పడడం, బరువు తగ్గడం, రక్తస్రావం కలగడం, అలసట, చర్మ మార్పులు, దగ్గు, మలబద్ధకం, మింగడంలో అసౌకర్యం, గురక, అజీర్ణం, జ్వరం, రక్తహీనత, సంతానోత్పత్తి సమస్యలు, చమట పట్టడం, దురలవాట్లు, కుటుంబ చరిత్ర, నిరక్షరాస్యత లాంటివి వస్తాయి. క్యాన్సర్ నిర్ధారణలో రక్త పరీక్షలు, ఇమేజింగ్ పరీక్షలు, ఎండోస్కొపీ లాంటివి వినియోగించబడుతున్నాయి. క్యాన్సర్ చికిత్సలో సర్జరీ, కీమోథెరపీ, రేడియోథెరపీ, ఇమ్యూనోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, హార్మోన్ థెరపీ, స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ లాంటి విధానాలు అందుబాటులో ఉన్నాయి.

## క్యాన్సర్ నివారణ మార్గాలు లేదా తీసుకోవలసిన జాగ్రత్తలు :

క్యాన్సర్ రాకుండా చూసుకోవలసి జాగ్రత్తల్లో పోషకాహారం తీసుకోవడం, తరుచుగా పరీక్షలు చేయించుకోవడం, శరీర బరువు నియంత్రణలో ఉంచుకోవడం, ఆల్కహాల్‌కు దూరంగా ఉండడం, పొగాకు ఉత్పత్తులకు చరమగీతం పాడడం, శారీరక వ్యాయామం, టీకాలు తీసుకోవడం, ఇన్‌ఫెక్షన్ కాకుండా చూసుకోవడం, చురుకైన దిన చర్య పాటించడం, క్యాన్సర్ రిస్కులకు దూరంగా ఉండడం, సూర్యుడి అతినీలలోహిత కిరణాలు సోకకుండా జాగ్రత్త పడడం లాంటివి తప్పనిసరిగా పాటించాలి.

## భారత్‌లో కోరలు చాస్తున్న క్యాన్సర్ బూతం:

భారత్‌లో క్యాన్సర్ వ్యాధి 12 శాతం నుంచి 18 శాతం వరకు పెరగడం గమనించారు. మన దేశంలో క్యాన్సర్ వ్యాధిని ముదిరిన తర్వాత గుర్తించడం జరుగుతున్నందున క్యాన్సర్ కారణ మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయి. భారతీయుల జీవిత కాలంలో ప్రతి 9 మందిలో ఒక్కరికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. క్యాన్సర్ బూతం కోరలు చాచడంతో భారత వైద్య ఆరోగ్య శాఖకు సవాళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. భారత్‌లో ఐదేళ్ల పాటు గర్భాశయ క్యాన్సర్ వ్యాధి చికిత్స రేటు 51.7 శాతం, రొమ్ము క్యాన్సర్ 66.4 శాతంగా నమోదు అవుతున్నది. అన్ని రకాల క్యాన్సర్లలో ఊపిరితిత్తులు, గర్భాశయ, పాంక్రియాటిక్ క్యాన్సర్లు అతి ప్రమాదకరమైనవిగా గుర్తించబడినవి.

క్యాన్సర్ రోగులకు చికిత్సలు చేస్తున్న ఆంకాలజీ వైద్యులు, రేడియాలజిస్టులు, సర్జన్లు, ప్యాథాలజిస్టులు, ఆంకాలజీ నర్సుల సేవలకు కృతజ్ఞతలు తెలిపే సందర్భంగా కూడా ప్రపంచ క్యాన్సర్ దినం వేదికలు ఉపయోగపడాలి. నిరక్షరాస్యత, పేదరికం, పోషకాహారలోపం లాంటి కారణాలతో మన దేశంలో క్యాన్సర్ అతిగా ప్రబలుతున్నందున ప్రతి ఒక్కరు దీని పట్ల అవగాహన కలిగి ఉండడం, అవగాహన కల్పించడం నిరంతరం జరగాలి. క్యాన్సర్ రోగులు లేని భారతాన్ని నిర్మించే కృషి చేయాలి.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# మొబైల్ ఫోన్ల తయారీలో ప్రపంచంలో రెండో అతి పెద్ద దేశంగా భారత్..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:ప్రపంచానికి తయారీ కూడలిగా భారత్ రూపొందుతుండడంలో ప్రధాన మంత్రి 'మేక్ ఇన్ ఇండియా' దార్శనికత సాయపడుతోంది. ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన పదేళ్లలో ఇది మనదేశాన్ని స్వయంసమృద్ధి దిశగా ముందుకు తీసుకుపోవడం, ఉత్పత్తికి ప్రోత్సాహాన్ని ఇవ్వడం మాత్రమే కాకుండా ఉద్యోగాల్ని కూడా సృష్టిస్తోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వేలు, సమాచార-ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ సమాచారాన్ని పంచుకోవడంతోపాటు గత దశాబ్ద కాలంలో మొబైల్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్‌లో ప్రశంసనీయ మార్పు చోటుచేసుకొందని కూడా ప్రధానంగా చెప్పారు.

దిగుమతుల స్థాయి నుంచి స్వతంత్రత దిశగా: మొబైల్ ఫోన్ల తయారీలో భారత్ ఎదుగుదల

మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ తయారీలో దేశం చెప్పుకోదగ్గ ప్రగతిని సాధించి ప్రపంచంలో మొబైల్ తయారీ అతి పెద్ద దేశాల్లో రెండో దేశంగా నిలిచింది. 2014లో, భారత్‌లో కేవలం 2 మొబైల్ తయారీ యూనిట్లు ఉండేవి. అయితే ప్రస్తుతం మన దేశంలో ఈ తయారీ యూనిట్లు 300కు పైగా పనిచేస్తూ, ఈ కీలక రంగంలో గణనీయ విస్తరణ నమోదైన విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి.

దేశంలో 2014 -15 లో అమ్ముడవుతూన్న మొబైల్ ఫోన్లలో 26 శాతం ఫోన్లు మాత్రమే భారత్‌లో తయారు అవుతూ, మిగతా ఫోన్లు బయటి దేశాల నుంచి దిగుమతి అవుతూ ఉండేవి. ప్రస్తుతం, దేశంలో అమ్ముడవుతున్న మొత్తం మొబైల్ ఫోన్లలో 99.2 శాతం ఫోన్లు ఇక్కడ తయారైనవే. మొబైల్ ఫోన్ల తయారీ విలువ 2014 ఆర్థిక సంవత్సరంలో రూ. 18,900 కోట్లు ఉండగా 2024 ఆర్థిక సంవత్సరానికి రూ. 4,22,000 కోట్లకు చేరుకొంది.

ఇండియాలో ఒక ఏడాదిలో 32.5 కోట్ల నుంచి 33 కోట్లకు పైగా మొబైల్ ఫోన్లను తయారు చేస్తున్నారు. మన దేశంలో సగటున లెక్కగడితే, సుమారు 100 మొబైల్ ఫోన్లను ఉపయోగిస్తున్నారు. భారత్‌లో తయారైన మొబైల్ ఫోన్లు దేశీయ విపణిని ఇంచుమించు పూర్తిగా కవ్మేశాయి. మొబైల్ ఫోన్ల ఎగుమతులు అమాంతం జోరందుకున్నాయంటే దానికి కారణం కూడా ఇదే. 2014లో ఎగుమతులు దాదాపుగా అసలు ఏమీ లేవనే చెప్పాలి. అలాంటిది ఇప్పుడు ఎగుమతుల విలువ రూ. 1,29,000 కోట్ల కన్నా మించింది.

పదేళ్లలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఉద్యోగాల కల్పన

ఈ రంగాన్ని విస్తరించడం ఉద్యోగాల కల్పనకు ఒక ప్రముఖ చోదకశక్తిగా కూడా నిలిచింది. ప్రత్యక్షంగాను, పరోక్షంగాను దాదాపు 12 లక్షల ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ ఉద్యోగ అవకాశాలు అనేక కుటుంబాల ఆర్థిక స్థితి బాగుపడడానికి తోడ్పడడం ఒక్కటే కాకుండా, దేశంలో సామాజిక ఆర్థిక స్థితులు మెరుగుపడడానికి కూడా దోహదం చేశాయి.

ఈ ముఖ్య విజయాల్ని సాధించడంలో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం కీలక పాత్ర పోషించింది. ఇది చార్జర్, బ్యాటరీ ప్యాక్స్, అన్ని రకాల మెకానిక్స్, యుఎస్‌బి కేబుల్స్‌తో పాటు లిథియం అయాన్ సెల్స్, స్పీకర్, మైక్రోఫోన్లు, డిస్‌ప్లే అసెంబ్లీస్, కెమెరా మాడ్యూల్స్ వంటి మరింత జటిల విడిభాగాలను దేశీయంగా ఉత్పత్తి చేయడానికి అనువైన వాతావరణాన్ని ఏర్పరిచింది.

భవిష్యత్తులో వేల్యూ చైన్‌ను, ముఖ్యంగా విడిభాగాలు, సెమీకండక్టర్ల ఉత్పత్తిని విస్తరించడంపైన దృష్టిని కేంద్రీకరించనున్నారు. ఈ మార్పు స్వయంసమృద్ధిని పెంచుకోవడంతోపాటు భారత్‌ను ప్రపంచ ఎలక్ట్రానిక్స్ విపణిలో ఒక ప్రముఖ పాత్రధారిగా నిలపాలన్న ఒక విస్తృత వ్యూహంలో ఓ భాగమే ఈ మార్పు అని చెప్పాలి.

వేల్యూ చైన్‌ను విస్తరించడం: ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ పురోగమించేటట్లు చూడడం

ఫైన్ కాంపొనంట్స్, సెమీకండక్టర్ల ఉత్పత్తికి ప్రాధాన్యాన్నిస్తూ వేల్యూ చైన్‌ను మరింతగా విస్తరించడానికి శ్రద్ధ వహిస్తున్నట్లు మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ ప్రస్తావించారు. దీంతో ఎలక్ట్రానిక్ విడిభాగాల అనుబంధ విస్తారిత వ్యవస్థ దేశీయంగా అభివృద్ధి చెందేందుకు మార్గం సుగమం కానుంది. ఇది ప్రపంచ స్థాయిలో ప్రధాన ఎలక్ట్రానిక్స్ విపణుల్లో ఒకటిగా భారత్ పటిష్ట స్థితికి చేరుకోవడానికి తోడ్పడుతుంది.

1950 నుంచి 1990 మధ్య ఆంక్షలతో కూడిన విధానాలు తయారీకి ఇబ్బందులు కలిగించాయి. అయినప్పటికీ, 'మేక్ ఇన్ ఇండియా' వేల్యూ చైన్‌లో బాగా విస్తరణకు కారణమై, కాంపొనంట్స్, చిప్స్ ఉత్పత్తిని పెంచి ఈ ధోరణిని పూర్తిగా మార్చివేసింది.

దేశంలో సెమీకండక్టర్ల తయారీకి ఒక పునాదిని ఏర్పాటు చేయాలనేది మేక్ ఇన్ ఇండియాలో ఒక ముఖ్య భాగంగా ఉంది. దీనిని నెరవేర్చాలని భారత్ గత ఆరు దశాబ్దాలకు పైగా ప్రయత్నిస్తోంది.

ఇండియా సెమీకండక్టర్ మిషను ప్రారంభించడం, మైక్రోన్‌తో మొదలుపెట్టి టాటా ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టులు రెండు, సీజీ పవర్ కు చెందిన ఒక ప్రాజెక్టు, కీన్స్‌కు చెందిన ఒక ప్రాజెక్టు కలుపుకొని అయిదు ప్రధాన ప్రాజెక్టులకు ఆమోదం లభించడంతో ఈ దేశంలో సెమీకండక్టర్లకు సంబంధించి వాస్తవిక తయారీకి పునాదిని వేస్తున్నట్లవుతోంది.

కొత్త ఆర్థిక యుగానికి రూపురేఖలు తీర్చిదిద్దుతున్న మేక్ ఇన్ ఇండియా

ఆటవస్తువులు మొదలు మొబైల్ ఫోన్లు, రక్షణ ఉపకరణాల వరకు ఉత్పత్తి విషయంలో మళ్ళీ అందరూ భారత్ వైపే చూడటం మొదలుపెట్టారు. ప్రపంచానికి తయారీ కూడలిగా మన దేశాన్ని రూపొందించాలన్నదే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెబుతున్న 'మేక్ ఇన్ ఇండియా' దార్శనికతలో ప్రధానసూత్రంగా ఉంది. ఈ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం స్వయంసమృద్ధిని ప్రోత్సహిస్తోంది. ఉత్పత్తి ప్రక్రియకు ఊతాన్నిస్తోంది. ఉద్యోగాలను కల్పిస్తోంది. దీంతో దేశం ఆర్థికంగా బలోపేతం కావడంలో కీలక తోడ్పాటు లభిస్తోంది.

# త్వరలో ముగియనున్న రిజిస్ట్రేషన్లు..

### ఈ నెల 21 లోపు 'ట్రూత్‌టెల్ హ్యాకథాన్ 'లో చేరండి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) సహకారంతో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 'ట్రూత్‌టెల్ హ్యాకథాన్ చాలెంజ్'ను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (డబ్ల్యూఏవీఈఎస్.. 'వేవ్స్') 2025లోని క్రియేట్ ఇన్ ఇండియా చాలెంజ్ (సీఐసీ)కి చెందిన ఒకటో సీజనులో ఈ హ్యాకథాన్ ఓ భాగంగా ఉంది. ఈ చాలెంజ్.. ప్రత్యక్ష ప్రసారంలో తప్పుడు సమాచారాన్ని ఇస్తున్న ధోరణులను పరిష్కరించడానికి కృత్రిమ మేధ (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్-ఏఐ) చోదక శక్తిగా నిలిచే పరిష్కారాలను అభివృద్ధిపరచాలన్న ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఒక ప్రధాన కార్యక్రమం.

ప్రస్తుతం ప్రసార మాధ్యమాలు చాలా వేగంగా విధులను నిర్వహిస్తున్నాయి. అంతే వేగంగా తప్పుడు సమాచారం చలామణీ అవుతోంది. వాస్తవాల ప్రాతిపదికన తప్పుడు సమాచారాన్ని గమనించే సవాలు ప్రసార సంస్థలకు, జర్నలిస్టులతోపాటు ప్రేక్షకులకు కూడా క్లిష్టంగా ఉంటోంది.

తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిలోకి తెస్తున్న వర్గాల ఆచూకీని కనిపెట్టి, నిజాన్ని నిగ్గుతేల్చేందుకు కృత్రిమ మేధను ఉపయోగించుకొంటూ కొన్ని సాధనాలను రూపొందించాల్సిందిగా డెవలపర్లను, డేటా సైంటిస్టులను, మీడియాలోని వృత్తినిపుణులను ఈ హ్యాకథాన్ కోరుతోంది. దీనికోసం రూ.10 లక్షల విలువైన బహుమతులను ఇవ్వనున్నారు. గెలిచే జట్లకు నగదు బహుమతులను ఇవ్వడం, మార్గదర్శకత్వాన్ని అందించే అవకాశాలను కల్పించడంతోపాటు ప్రాథమిక దశలో ప్రముఖ సాంకేతిక నిపుణుల వద్ద నుంచి సహాయసహకారాలను కూడా అందజేయనున్నారు.

ఇప్పటి వరకు, హ్యాకథాన్ లో పాల్గొనదలచిన వారి వద్ద నుంచి చక్కని ప్రతిస్పందన వచ్చింది. ప్రపంచంలో వివిధ దేశాల నుంచి 5,600కు పైగా ఈ హ్యాకథాన్‌లో పాల్గొనేందుకు ముందుకువచ్చి రిజిస్ట్రేషన్లను పూర్తి చేయించుకొన్నారు. ఈ హ్యాకథాన్‌లో పాల్గొనదలుస్తున్న వారిలో 36 శాతం మంది మహిళలున్నారు.

ఈ హ్యాకథాన్‌కు ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత మంత్రిత్వ శాఖ, ఇండియాఏఐ మిషన్ లతోపాటు డేటాలీడ్స్ సహా ప్రముఖ భాగస్వాముల మద్దతు లభిస్తోంది.

ఇది మీడియా టెక్నాలజీలో నవకల్పనలకు ప్రోత్సాహాన్ని ఇవ్వడంతోపాటు ప్రసార ప్రమాణాలను పరిరక్షించడానికి ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ఎంత అంకితభావంతో ఉందో స్పష్టం చేస్తోంది.

ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) భారత్‌లో మొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అత్యున్నత పారిశ్రామిక సంస్థ. ఇది మన దేశ డిజిటల్ విస్తారిత అనుబంధ వ్యవస్థను బలపరచడానికి నవకల్పనకు ఊతాన్నివ్వడం, విధానపరంగా తగిన సూచనలు సలహాలను ఇస్తూ ఉండడంతోపాటు ప్రపంచ స్థాయిలో సహకారాన్ని ప్రోత్సహిస్తోంది.

# నూతన సాయిల్ హెల్త్ కార్డుల పథకం అమలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:సాయిల్ హెల్త్ అండ్ ఫర్టిలిటీ పథకాన్ని 2014-15 నుంచి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 24.74 కోట్ల భూసార ఆరోగ్య కార్డు (ఎస్‌హెచ్‌సీ)లను జారీ చేశారు. అలాగే రూ.1706.18 కోట్ల పథకాలను వివిధ రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు విడుదల చేశారు. ఇప్పటి వరకు 8272 భూసార పరీక్షా కేంద్రాలు (1068 భూసార పరీక్షా కేంద్రాలు, 163 మొబైల్ భూసార పరీక్షా కేంద్రాలు, 6376 మినీ భూసార పరీక్షా కేంద్రాలు, 665 గ్రామీణ స్థాయి భూసార పరీక్షా కేంద్రాలు) దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారు.

వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే సాయిల్ అండ్ ల్యాండ్ సర్వే ఆఫ్ ఇండియా స్వల్పకాల (3 రోజులు) వ్యవధి ఉన్న శిక్షణా కోర్సులను అందిస్తుంది. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) ద్వారా నేలల సమాచారానికి సంబంధించిన అప్లికేషన్, భూసార నిర్వహణ, ఇంటిగ్రేటెడ్ వాటర్‌షెడ్ మేనేజ్మెంట్ (ఐడబ్ల్యూఎంపీ), సహజ వనరుల నిర్వహణకు జియోస్పేషియల్ టెక్నాలజీ, సాయిల్ సర్వే అండ్ మ్యాపింగ్ తదితర అంశాల్లో ఈ కోర్సులు అందజేస్తారు.

వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన అధికారుల కోసం ఈ శిక్షణా కార్యక్రమాలు రూపొందించారు. వేర్వేరు ఏజెన్సీల ద్వారా వారికి శిక్షణ అందిస్తారు. 2024లో పశ్చిమబెంగాల్, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వ్యవసాయం, అటవీ, మట్టి, నీటి సంరక్షణా విభాగాలకు చెందిన అధికారులకు శిక్షణ ఇచ్చారు. 2025లో జమ్ము కశ్మీర్‌కు చెందిన వ్యవసాయ విభాగ అధికారులు శిక్షణ పొందారు.

ఇప్పటి వరకు 17 రాష్ట్రాల్లో 665 గ్రామ స్థాయి భూసార పరీక్షా కేంద్రాలు (వీఎస్‌టీఎల్)ను ఏర్పాటయ్యాయి. వీటిలో కొన్నింటిని ఔత్సాహికులు, స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ) నిర్వహిస్తున్నాయి. వీటికి సంబంధించిన సమాచారాన్ని కేంద్రం నిర్వహించదు.

సాయిల్ అండ్ ల్యాండ్ యూజ్ సర్వే ఆఫ్ ఇండియా ఇప్పటి వరకు 40 ఆకాంక్షాత్మక జిల్లాల్లో 1:10,000 నిష్పత్తిలో దాదాపుగా 290 లక్షల హెక్టార్ల మేర సాయిల్ మ్యాపింగ్ పూర్తి చేసింది. అవసరమైనంత మేరకే ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకుగాను ఇప్పటి వరకు 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 1,987 గ్రామస్థాయిలో భూమిలోని పోషకాలను తెలియజేసే మ్యాపులను రూపొందించింది.

లోకసభలో ఈ రోజు అడిగిన ప్రశ్నకు బదులుగా కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఈ సమాచారాన్ని లిఖితపూర్వకంగా అందించారు.

# గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థులకు అస్వస్థత..



మహబూబాబాద్, ఫిబ్రవరి 7: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గ్రామంలోని సాంఘీక సంక్షేమ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నలుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులకు వాంతులు విరేచనాలు కావడంతో గమనించిన గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు వెంటనే గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విద్యార్థులకు చికిత్స అందించారు.

విద్యార్థులు గురువారం సాయంత్రం స్నాక్స్ సమయంలో గుడాలు తీసుకొని రాత్రి భోజనం చేసిన తరువాత నిద్రపోయామని తెల్లవారు జామున కడుపులో నొప్పి, వాంతులు, విరోచనాలు అవుతున్నాయని విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలుపగా.. వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. గురుకుల పాఠశాలలో రీజనల్ కోఆర్డినేటర్ హరి సింగ్ పర్యవేక్షణ లోపం వల్లనే ఇలా జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# వైసీపీ తీర్థం పుచ్చుకున్న కాంగ్రెస్ సీనియర్ నేత శైలజా నాథ్



అమరావతి, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శైలజా నాథ్ వైసీపీ కండువా కప్పుకున్నారు. ఏపీ మాజీ సీఎం జగన్ సమక్షంలో వైసీపీ పార్టీలో చేరారు..

నేడు జగన్ నివాసానికి వచ్చిన శైలజానాథ్ కు వైసీపీ పార్టీ కండువా కప్పి.. పార్టీలోకి ఆహ్వానించారు ఏపీ మాజీ సీఎం జగన్. అలాగే ఆయనతో పాటే? కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కొందరూ జాయిన్ అయ్యారు. వైఎస్ షర్మిల పనితీరు నచ్చక.. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చానని శైలజానాథ్ తెలిపారు.






# అమెరికాలో తెలుగు విద్యార్థి ఆత్మహత్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:అమెరికాలో తెలుగు విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తుమ్మేటి సాయికుమార్ రెడ్డి అనే విద్యార్థి న్యూయార్క్ లో బలవన్మరణానికి పాల్పడ్డాడు. సాయి ఆత్మహత్యతో అతని మిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషయం వారి తల్లిదండ్రులకు తెలియదు. సాయి ఫోన్ లాక్ చేసి ఉండటంతో కుటుంబ సభ్యులకు ఎలా తెలియజేయాలో తెలియక మీడియాకు సమాచారం అందించారు. సాయికుమార్ రెడ్డి ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్నాడు. అతడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

# కర్ణాటక సీఎంకు ఊరట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ముడా స్కామ్ వ్యవహారంలో ఊరట లభించింది. ముడా ఇళ్ల స్థలాల కేసును సీబీఐకి అప్పగించాలని మైసూరు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టివేస్తూ.. సంచలన తీర్పును వెలువరించింది. కాగా, లోకాయుక్త ముడా స్కామ్‌లో పోలీసులు సక్రమంగా దర్యాప్తు చేయలేదని, కాబట్టి ఈ కేసును సీబీఐకి అప్పగించాలని స్నేహమయి కృష్ణ పిటిషన్ దాఖలు చేశారు. కేసు ఇరు పక్షాల వాదనలు విన్న చీఫ్ జస్టిస్ ఎం.నాగప్రసన్న గత నెల 28న తీర్పు రిజర్వు చేశారు.

పిటిషన్ వేసిన వ్యక్తికి దర్యాప్తు సంస్థను ఎంపిక చేసే హక్కు లేదని ధర్మాసనం పేర్కొంది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది రాజకీయ ఒత్తిడితో దర్యాప్తు పక్కదారి పట్టించవచ్చని ఆరోపించారు. నిజానిజాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ దర్యాప్తు అనివార్యమని కోరారు. మరోవైపు సీఎం తరఫు న్యాయవాది కపిల్ సిబల్ అన్ని కేసులను సీబీఐకి అప్పగించాలనడం సరికాదని కోర్టుకు తెలిపారు. ఇలా అయితే లోకాయుక్త పని చేయడం ఎందుకని వాదనలు వినిపించారు.

లోకాయుక్త పోలీసులు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటారని అంటున్నారని, సీబీఐ కూడా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఉన్న సీబీఐ స్వతంత్ర దర్యాప్తు సంస్థ కాదని తెలిపారు. లోకాయుక్త దర్యాప్తు స్వతంత్రంగా ఉంటుందని కబిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు ముడా కేసును సీబీఐకి బదిలీ చేయాలన్న పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది.

# భూమిలేని రైతుల సంక్షేమం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:భూమిలేని రైతులకు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట గణన/ సర్వేనూ మంత్రిత్వ శాఖ నిర్వహించలేదు. కాబట్టి దేశంలోని భూమి లేని రైతులు, యజమానులతో పంట భాగస్వామ్య ప్రాతిపదికన సాగు చేసుకుంటున్న రైతుల కచ్చితమైన సంఖ్య అందుబాటులో లేదు. అయితే, 2015-16 తాజా వ్యవసాయ గణన ప్రకారం దేశంలో పూర్తిగా లీజుకు తీసుకుని సాగుచేస్తున్న కమతాలు/ భూమిలేని రైతుల సంఖ్య 5,31,285.

వ్యవసాయం రాష్ట్ర జాబితాలోని అంశం కాబట్టి.. భూమిలేని రైతులు సహా రైతు సంక్షేమానికి సంబంధించిన వ్యవసాయ పథకాలు/ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తాయి. కేంద్రప్రభుత్వ/ కేంద్ర ప్రాయోజిత పథకాలు/ కార్యక్రమాల ద్వారా కేంద్రం కూడా రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు సహాయపడుతుంది. వీటితోపాటు.. ముఖ్యంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్ బీవై), పునర్వ్యవస్థీకృత వాతావరణ ఆధారిత పంట బీమా పథకం (ఆర్ డబ్ల్యూబీసీఐఎస్), కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) పథకాల పరిధిలోకి భూమిలేని, కౌలు రైతులు, పంట భాగస్వామ్య ప్రాతిపదికన సాగు చేసుకుంటున్న రైతులు వస్తారు.

కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) పథకం కింద రైతులకు 7% సబ్సిడీ వడ్డీ రేటుతో కేసీసీ రుణాలు లభిస్తాయి. దీనికోసం సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) ద్వారా 1.5% ముందస్తు వడ్డీ రాయితీ (ఐఎస్)ని బ్యాంకులకు అందిస్తున్నారు. వెంటవెంటనే రుణాలను తిరిగి చెల్లించే రైతులకు అదనంగా 3% సత్వర చెల్లింపు ప్రోత్సాహకం (పీఆర్ఐ) లభిస్తుంది. తద్వారా వారికి ఏడాదికి నాలుగు శాతం మాత్రమే వడ్డీ రేటు ఉంటుంది. రూ. 3 లక్షల వరకు రుణాలపై ఐఎస్, పీఆర్ఐ పథకాల ప్రయోజనాలు లభిస్తాయి. అనుబంధ కార్యకలాపాల (పంట కోసం కాకుండా) కోసం స్వల్పకాలిక రుణం తీసుకుంటే రుణ మొత్తం రూ. 2 లక్షలకే పరిమితమవుతుంది.

2018 జూలై 4 నాటి ఆర్బీఐ మాస్టర్ సర్క్యులర్ ప్రకారం.. నోటిమాటతో కౌలు చేసుకుంటున్న వారు, పంట భాగస్వాములు, స్వయంసహాయక బృందాలు లేదా రైతుల ఉమ్మడి పూచీ బృందాలకు స్వల్పకాలిక రుణాలను పొందే అర్హత ఉంది. కౌలు రైతులు, పంట భాగస్వాములు ఈ బృందాల పరిధిలోకి వస్తారు.

అంతేకాకుండా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు ఉపశమనం కలిగించేలా.. మొదటి సంవత్సరం బ్యాంకులకు చెల్లించాల్సిన వడ్డీ రాయితీ అందుబాటులో ఉండే మొత్తాన్ని రైతుకు అనుకూలంగా తిరిగి నిర్ణయిస్తారు. రెండో ఏడాది నుంచి వాటికి సాధారణ వడ్డీ రేటు వర్తిస్తుందని ఆర్బీఐ విధానం నిర్దేశిస్తోంది.

ఎన్డీఆర్ఎఫ్ సహాయ మంజూరుపై వివిధ మంత్రిత్వ శాఖల అధికారులతో కూడిన కేంద్ర బృందం (ఐఎంసీటీ), జాతీయ కార్యవర్గ ఉపసంఘం (ఎస్సీ-ఎన్ఈసీ) నివేదిక ఆధారంగా.. తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన రైతులకు పునర్వ్యవస్థీకరించిన పంటరుణాలపై కూడా గరిష్టంగా ఐదేళ్ల పాటు వడ్డీ రాయితీ, సత్వర చెల్లింపు ప్రోత్సాహకాన్ని అందిస్తారు. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రాంనాథ్ ఠాకూర్ లోకసభలో ఓ లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

# బీసీ కులగణన.. కాంగ్రెస్ కుట్ర.. ఎమ్మెల్యే ధన్ పాల్




నిజామాబాద్, ఫిబ్రవరి 7: బీసీ కులగణన పేరుతో కాంగ్రెస్ ఒక పెద్ద కుట్ర అని ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ అన్నారు. బీసీలకు అన్యాయం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చడం ఖాయమని నొక్కి చెప్పారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ? తెలంగాణ ప్రభుత్వం కులగణన గొప్పగా చేసాము, మా అంత గొప్ప పార్టీ, గొప్ప నాయకులు దేశంలో ఎవరూ లేరన్నట్టు అసెంబ్లీలో తీర్మానం పెడుతున్నామని బీసీ వర్గం ప్రజలను మోసం చేసే కుట్ర అసెంబ్లీలో జరిగిందన్నారు.

రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీ ఓట్ల కోసం కాంగ్రెస్ చేసిన పెద్ద డ్రామా అని ఆరోపించారు. గత ప్రభుత్వం లెక్కల ప్రకారం 1.85 కోట్లకు పైగా అంటే 51 శాతం ఉంటే.. ఇప్పుడు కాంగ్రెస్ లెక్కల ప్రకారం 1.65 కోట్లు అంటే 46.25 శాతం నిర్ణయించిందని, మరి దాదాపు 21లక్షల బీసీలు ఏమైనారని ప్రశ్నించారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలనేదానికి తాము వ్యతిరేకం కాదని, కానీ బీసీ కులగణన పేరుతో మైనారిటీ వర్గాన్ని బీసీలో కలిపే కుట్ర చేసినట్లు తమకు అనుమానం వస్తుందన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో రూ. 50కోట్లతో బీసీ కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

ఒక్క దానికైనా కనీసం శంకుస్థాపన చేసారా అని ప్రశ్నించారు. బీసీలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చకుంటే రేవంత్ సర్కార్ ను బీసీ బిడ్డలు కూల్చడం ఖాయమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, మాజీ ఫ్లోర్ లీడర్స్ రేవంత్ రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా.. ఎమ్మెల్యే ధన్ పాల్

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు. అంతేకాకుండా తన ట్రస్ట్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తానని బాధితులకు భరోసా కల్పించారు. నగరంలోని కోటగల్లీ మార్కెండేయ ఆలయ సమీపంలో మధి ర ప్రసాద్, సుమలత నివసిస్తున్న ఇండ్లలో ఇంట్లో వెలిగించిన దీపం కారణంగా ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఇండ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న అర్బన్ ఎమ్మెల్యే సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. తన ట్రస్ట్ ద్వారా స్వంతంగా బాధిత కుటుంబానికి రూ. 25వేలు ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

వెంటనే ఆర్డీవోతో ఫోన్ లో మాట్లాడి బాధితులకు పునరావాస కల్పన, ప్రభుత్వం నుండి రావాలిసిన సహాయ సహకారాలు వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కలెక్టర్ తో మాట్లాడి ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం నుండి వచ్చే ఇందిరమ్మ ఇళ్ళు రూ. 5లక్షల ఆర్థిక సహాయం కూడా అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, బీజే వైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తీక్, జగన్, ఆనంద్, మఠం పవన్, మున్నా, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్ట్ విస్తార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:అన్ని చోట్లా విశ్వసనీయమైన, చెల్లుబాటయ్యే, అధునాతన వనరులను సమన్వయం చేసుకుంటూ వ్యవసాయం కోసం ఏకీకృతమైన, బహుకేంద్రక డిజిటల్ వ్యవస్థను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రాజెక్ట్ విస్తార్ (వర్చువల్లీ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సిస్ రిసోర్సెస్) పనిచేస్తుంది. ఇది రైతుల స్పందనను నమోదు చేసి, పరస్పరం సంభాషించుకునే అవకాశం కల్పించేలా డిజిటల్ పరిష్కారాల సామర్థ్యాన్ని, సౌలభ్యాన్ని, సమగ్రతను మెరుగుపంచడంపై దృష్టి సారిస్తుంది. ఐసీఏఆర్ సంస్థలు, రాష్ట్రాల వ్యవసాయ విద్యాలయాల విస్తృత ప్రయత్నాలను సమన్వయం చేయడం ద్వారా కేంద్ర-రాష్ట్రాల భాగస్వామ్యాన్ని ముందుకు నడిపిస్తూ రైతులతో బంధాన్ని బలోపేతం చేస్తుంది. వ్యవసాయ విస్తరణ కోసం బలమైన డిజిటల్ పబ్లిక్ఇన్ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)ను అభివృద్ధి చేయడానికి విస్తార్ తోడ్పాటు అందిస్తుంది. ఆచరణాత్మకమైన సమాచారాన్ని రైతులకు అందించడం, సహకారాన్ని క్రమబద్ధీకరించడం, డిజిటల్ వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు దీర్ఘకాలం కొనసాగేలా చూడడమే దీని లక్ష్యం.

పంటల దిగుబడి, మార్కెటింగ్, ధరలు, సరఫరా వ్యవస్థ నిర్వహణ, క్లైమేట్ స్మార్ట్ అగ్రికల్చరల్ (సీఎస్ఏ) పద్ధతులు, వాతావరణ సూచనలతో సహా అవసరమైన ఇతర సమాచారాన్ని రైతులకు అందించడమే లక్ష్యంగా వ్యవసాయ విస్తరణ వ్యవస్థ సేవలను డిజిటలైజ్ చేయనున్నారు. అలాగే వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో రైతులకు లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం అందిస్తున్న పథకాల సమాచారాన్నిఈ సేవలు అందిస్తాయి.

ఒడిశా, బీహార్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం రాష్ట్రాల సాంకేతిక, అంశం ఆధారిత సమీక్షా సంఘాలను వ్యవస్థలో చేరుస్తారు. అలాగే చిన్న స్థాయిలో నిర్వహించే పైలట్ కార్యక్రమాల ద్వారా పని ప్రారంభిస్తారు.

ప్రస్తుతం విస్తార్ ప్రాజెక్టు అమలుకు వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మద్దతు ఇస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయించలేదు.

రైతులకు తాజా సమాచారాన్ని అందించేందుకు అన్ని కార్యక్రమాలు, బహుకేంద్రక పరిష్కారాలను ఏకీకృతం చేయడమే విస్తార్ లక్ష్యం. దీనిలో ఏఐ ఆధారిత చాట్‌బాట్లను క్షేత్రస్థాయిలో వినియోగించి అగ్రిస్టాక్ తో అనుసంధానం చేయడం కూడా భాగంగా ఉన్నాయి.

విస్తార్లో భాగంగా డిజిటల్ బాట్ల వినియోగంపై సమగ్ర శిక్షణ అందిస్తారు. ప్రస్తుతం కొనసాగుతున్న భాగస్వామ్యాలు, నెట్వర్క్ వాలంటీర్ల ద్వారా ఫ్రంట్ లైన్ ఎక్స్టెన్షన్ వర్కర్ (ఎఫ్ఎల్ఈడబ్ల్యు)లకు శిక్షణ ఇస్తారు. ఫలితంగా వారిలో వీడియో రూపకల్పన నైపుణ్యాలు మెరుగుపడతాయి. అలాగే అధునాతన ఐటీ సాధనాలను వినియోగించడం ద్వారా క్షేత్రస్థాయిలో అవసరమైన సమాచారం పొందగలుగుతారు. తద్వారా రైతులకు దశలవారీగా శిక్షణ ఇవ్వడానికి వీలవుతుంది.

ప్రజా సంక్షేమార్థం విస్తార్ డీపీఐ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి లాభాపేక్ష లేని ఏక్ స్టెప్ ఫౌండేషన్‌తో అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఇదే ప్రాతిపదికన సమాచార అభివృద్ధికి డిజిటల్ గ్రీన్ లాంటి లాభాపేక్ష లేని సంస్థలు విస్తార్‌కు తోడ్పాటు అందిస్తున్నాయి. వ్యవసాయం, రైతు సంక్షేమ విభాగంతో ఐఐటీ మద్రాస్ సైతం ఓ అవగాహనా ఒప్పందం కుదుర్చు కుంది. దీని ప్రకారం రైతులకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవసాయ అంకుర సంస్థలతో సమాచారాన్ని పంచుకుంటుంది.

లోక్‌సభలో ఈ రోజు అడిగిన ప్రశ్నకు బదులుగా కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్ ఈ సమాచారాన్ని లిఖితపూర్వకంగా అందించారు.

# ఉగ్రవాదుల ఉనికిని రూపుమాపడమే మన లక్ష్యం కావాలి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:జమ్మూ కాశ్మీర్‌లో భద్రత స్థితిపై న్యూ ఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన ఒక సమావేశానికి కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టరు, జమ్మూ కాశ్మీర్ ప్రధాన కార్యదర్శి, జమ్మూ కాశ్మీర్ డీజీపీలతోపాటు, హోం శాఖకు. జమ్మూ కాశ్మీర్ పాలనయంత్రాంగానికి చెందిన ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా నిన్న కూడా జమ్మూ కాశ్మీర్‌లో భద్రత స్థితిపై ఒక ముఖ్య సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సైన్య దళ ప్రధానాధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేది, హోం శాఖ కార్యదర్శిలతోపాటు సైన్యానికి, హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

సమావేశంలో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, జమ్మూ కాశ్మీర్ నుంచి ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం సంకల్పం చెప్పుకొంద న్నారు. మోదీ ప్రభుత్వం తదేకంగా, సమన్వయపూర్వకంగా కషి చేస్తన్నందు వల్ల జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద అనుబంధ విస్తారిత వ్యవస్థను చాలావరకు బలహీనపరచగలిగినట్లు ఆయన చెప్పారు. 'చొరబాట్లకు ఏ మాత్రం అవకాశాలను వదలొద్దు'నేదే ధ్యేయంగా పెట్టుకొని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరును ఉద్ధృతం చేయాల్సిందిగా భద్రతా సంస్థలన్నిటికి హోం మంత్రి ఆదేశాలిచ్చారు. చొరబాట్లపైనా, భయాన్ని పెంచే చర్యలపైనా నిర్దాక్షిణ్యంగా విజృంభించాల్సిందిగాను, మరింత కఠినచర్యల్ని తీసుకోవాల్సిందిగాను అన్ని భద్రతా సంస్థలకు ఆయన సూచించారు. ఉగ్రవాదుల జాడే లేకుండా చేయడమే మన లక్ష్యం కావాలి అని ఆయన అన్నారు.

చొరబాటుదారులతోపాటు ఉగ్రవాదులు వారి కార్యకలాపాలను నిర్వహించుకోవడానికి మాదకద్రవ్యాల మూకల నెట్‌వర్క్ కొమ్ముకాస్తోందని శ్రీ అమిత్ షా అన్నారు. మత్తుమందుల వ్యాపారంలో సంపాదిస్తున్న డబ్బును ఉగ్రవాద కార్యకలాపాలకు మళ్లించడాన్ని అడ్డుకోవడానికి సర్వత్రా డేగకళ్లతో నిఘా పెడుతూ కఠిన చర్యల్ని సరైన సమయంలో తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. కొత్త నేరవిచారణ సంబంధిత చట్టాలను సకాలంలో అమలుపరచే దృష్టితో ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్)లో ఉద్యోగాలకు కొత్తవారిని నియమించుకోవాలని ఏజెన్సీలకు శ్రీ అమిత్ షా ఆదేశాలిచ్చారు.

జమ్మూ కాశ్మీర్‌ను ఉగ్రవాదం ఆనవాళ్లనేవే ఉండకుండా తీర్చిదిద్దాలి అనే లక్ష్యాన్ని సాధించడానికి మోదీ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని 'ఎంతమాత్రం సహించని విధానాన్ని' అనుసరిస్తోందని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు. జమ్మూ కాశ్మీర్ నుంచి ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి అప్రమత్తంగా ఉంటూ అన్ని శక్తులను కూడగట్టుకొని ముందుకు కదులుతూ ఉండాల్సిందిగా అన్ని భద్రతా సంస్థలనూ ఆయన ఆదేశించారు. జమ్మూ కాశ్మీర్‌లో భద్రత పరిరక్షణకు సంబంధించి అన్ని ప్రమాణాల్లో చెప్పుకోదగ్గ మెరుగుదలను నమోదు చేయడానికి భద్రతాసంస్థలు నడుంబిగించి చేపట్టిన ప్రయత్నాల్ని కేంద్ర హోం మంత్రి ప్రశంసించారు.

# వేవ్స్ 2025 'రీల్ మేకింగ్' పోటీలకు 3,300కు పైగా ఎంట్రీలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:ప్రపంచ దృశ్య, శ్రవ్య సదస్సు (వేవ్స్)లో నిర్వహించనున్న 'రీల్ మేకింగ్' పోటీలకు అద్భుత స్పందన లభించింది. దేశవ్యాప్త భాగస్వామ్యంతోపాటు 20 దేశాల నుంచి 3,379 మంది నమోదు చేసుకున్నారు.

వేవ్స్ లో కీలక కార్యక్రమంగా ప్రారంభిస్తున్న ఈ పోటీ.. మీడియా, వినోద రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతున్న భారత్ ప్రాధాన్యాన్ని చాటుతుంది. డిజిటల్ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ దేశంలో వేగంగా విస్తరిస్తున్న తీరునూ ఇది ప్రతిబింబిస్తుంది. కేంద్ర ప్రభుత్వ 'క్రియేట్ ఇన్ ఇండియా' దార్శనికతకు అనుగుణంగా రూపొందించిన ఈ పోటీలు దేశం నలుమూలలతోపాటు అంతర్జాతీయంగానూ ప్రతిభావంతులైన కళాకారులకు సాధికారిక అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

ఈ పోటీల్లో అఫ్ఘనిస్థాన్, అల్బేనియా, అమెరికా, ఆంటిగ్వా, బార్బుడా, బంగ్లాదేశ్, యూఏఈ, ఆస్ట్రేలియా, జర్మనీ తదితర దేశాల నుంచి గణనీయ సంఖ్యలో కళాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. భారత సృజనాత్మక రంగ ప్రాధాన్యం పెరుగుతుందనడానికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సృజనకారులకు ప్రధాన వేదికగా వేవ్స్ నిలుస్తుందన డానికి ఈ అంతర్జాతీయ స్థాయి భాగస్వామ్యం నిదర్శనం.

తవాంగ్ నుంచి పోర్ట్ బ్లెయిర్ వరకు: దేశవ్యాప్తంగా వెల్లివిరుస్తున్న కథనోత్సాహం

దేశీయంగా తవాంగ్ (అరుణాచలప్రదేశ్), దిమాపూర్ (నాగాలాండ్), కార్గిల్ (లద్దాఖ్), లేహ్, షోపియాన్ (కాశ్మీర్), పోర్ట్ బ్లెయిర్ (అండమాన్ - నికోబార్ దీవులు), తెలియామోరా (త్రిపుర), కాసరగోడ్ (కేరళ), గ్యాంగ్ టక్ (సిక్కిం) సహా దేశంలోని వివిధ ప్రాంతాలు, మారుమూల ప్రదేశాల నుంచి కూడా ఎంట్రీలు వచ్చాయి. వేవ్స్ 'రీల్ మేకింగ్' పోటీలకు చిన్న పట్టణాల నుంచీ విశేష స్పందన రావడం, సృజనకు నిలయంగా అవి ఎదుగుతుండడం సుసంపన్న భారత కథన సంప్రదాయాలను, సాంకేతిక సృజన రంగంలో వృద్ధిని ఇది ప్రతిబింబిస్తోంది.

20 ఏళ్ల వయస్సు దాటిన వారు పోటీకి అర్హులు. ఇందులో భాగంగా.. సాంకేతిక, మౌలిక సదుపాయాల్లో భారత ప్రస్తుత పురోగతిని చాటేలా 'వికసిత భారత్', ఈ రంగాల్లో దేశ భవిష్యత్ వృద్ధిని ప్రతిబింబించేలా 'ఇండియా ఏ 2047' వంటి ఇతివృత్తాలపై రీల్స్ రూపొందించాల్సి ఉంటుంది. భారత సృజనాత్మక ప్రస్థానాన్ని 30 నుంచి 60 సెకన్ల చిత్రాల్లో సంక్షిప్తంగా ప్రదర్శిస్తూ.. దేశాభివృద్ధి దిశగా వారి సృజనాత్మకతను, దూరదృష్టినీ చాటేలా ఇవి కథకులకు ఓ వేదికను అందిస్తాయి.

రీల్ మేకింగ్ పోటీ విజేతలకు లభించే ప్రత్యేకమైన అవకాశాలు:

మెటా నిర్వహించే కార్యక్రమం, రీల్స్ మాస్టర్ క్లాస్ కు ఆహ్వానం అందుతుంది.

వేవ్స్ లో పాల్గొనడం కోసం వ్యయాలన్నింటినీ చెల్లిస్తారు. అక్కడ వారికి విశేష గౌరవం లభిస్తుంది.

అంతర్జాతీయ స్థాయి కంటెంట్ సృజనాత్మక పోటీల్లో పాల్గొనేలా ఫైనలిస్టులకు మంత్రిత్వ శాఖ సహకరిస్తుంది.

విజేతల రీల్స్ ను వేవ్స్ యశో వేదిక (హాల్ ఆఫ్ ఫేమ్)పై, అధికారిక వెబ్ సైట్ లో, సామాజిక మాధ్యమ వేదికలపై ప్రదర్శిస్తారు.

'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్'

భారత సృజనాత్మక శక్తికి సరికొత్త అంతర్జాతీయ గుర్తింపును తేవడంతోపాటు మీడియా, వినోదం, సృజన రంగాలకు భారత్ ను ప్రధాన గమ్యస్థానంగా నిలపాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత, సంకల్పాలే వేవ్స్ కు స్ఫూర్తి. ఈ రంగంలో అగ్రగాములు, భాగస్వాములు, ఆవిష్కర్తలందరినీ ఒక్కచోటికి చేర్చి.. ప్రస్తుత ధోరణులపై చర్చించడానికి, సహకారాన్ని పెంపొందించడానికి, భారత సృజనాత్మక సంపత్తిని ప్రదర్శించడానికి.. తద్వారా 'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' అన్న ప్రధానమంత్రి దార్శనికతను సాకారం చేయడానికి వేవ్స్ అవకాశం కల్పిస్తుంది.

దేశవ్యాప్తంగా నలుమూలల నుంచీ 20 ఇతర దేశాల నుంచీ కళాకారులు పాల్గొంటున్న ఈ రీల్ మేకింగ్ పోటీ వైవిధ్యభరిత, క్రియాశీల భారత కథన కౌశలానికి నిదర్శనం. మీడియా, వినోద రంగంలో ప్రధాన అంతర్జాతీయ కేంద్రంగా భారత్ స్థానాన్ని ఇది సుస్థిరం చేస్తుంది.

# 40 లక్షలకు పైగా భక్తులకు 233 నీటి ఏటీయంల ద్వారా 24/7 తాగునీటి సరఫరా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా 2025కు దేశవిదేశాల నుంచి వస్తున్న భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. మేళా జరుగుతున్న ప్రాంతంలో మొత్తం 233 వాటర్ ఏటీయంలను ఏర్పాటు చేశారు.

ఇవి ఎలాంటి ఆటంకం లేకుండా 24 గంటలూ పనిచేస్తాయి. వీటి ద్వారా యాత్రికులు ప్రతిరోజూ స్వచ్ఛమైన ఆర్వో (రివర్స్ ఆస్మాసిస్) నీటిని పొందుతున్నారు. జనవరి 21, 2025 నుంచి ఫిబ్రవరి 1, 2025 వరకు 40 లక్షల మంది భక్తులు ఈ నీటి ఏటీయంల ద్వారా లబ్ధి పొందారు.

భక్తుల సౌకర్యార్థం ఈ నీటి ఏటీయంల ద్వారా ఉచిత తాగునీటి సరఫరా జరిగేలా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. ఆరంభంలో రూపాయికి లీటరు ఆర్వో నీటిని అందించారు. దీనికోసం రూపాయి నాణేన్ని ఏటీయంలో వేయడం లేదా యూపీఐ స్కానింగ్ ద్వారా చెల్లింపులు చేసేవారు. అయితే ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వచ్ఛమైన నీటిని యాత్రికులకు అందించేందుకు ఈ సేవలను పూర్తిగా ఉచితం చేశారు. ప్రతి వాటర్ ఏటీయం దగ్గర ఒక ఆపరేటర్‌ను నియమించారు. నీటి కోసం మీట నొక్కగానే స్వచ్ఛమైన తాగునీరు యాత్రికులకు లభించేలా వారు జాగ్రత్త వహిస్తారు. తాగునీటి కోసం యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడటంతో పాటు అంతరాయం లేకుండా నీటి సరఫరా కొనసాగేలా చూసుకుంటారు.

మహాకుంభ్‌లో ఏర్పాటు చేసిన నీటి ఏటీయంలు అధునాతన టెక్నాలజీ సాయంతో పనిచేస్తాయి. వీటి పనితీరు పూర్తిగా యంత్ర పరిజ్ఞానం ఆధారంగానే సాగుతుంది. వీటిలో సెన్సర్-ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను అమర్చారు. ఇది ఏటీయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే గుర్తిస్తుంది. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే జలమండలి టెక్నీషియన్లు దానికి మరమ్మతులు చేసి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తారు. మహాకుంభకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్న నేపథ్యంలో ఒక్కో వాటర్ ఏటీయం 12,000 నుంచి 15,000 లీటర్ల ఆర్వో నీటిని ప్రతిరోజూ సరఫరా చేస్తోంది. అన్ని వాటర్ ఏటీయంల్లో సిమ్-ఆధారిత సాంకేతికత ఏర్పాటు చేసి కేంద్రీయ పర్యవేక్షణా వ్యవస్థకు అనుసంధానం చేశారు.

నీటి వినియోగం, నీటి మట్టం నిర్వహణ, నీటి నాణ్యత, పంపిణీ చేసిన నీటి పరిమాణాన్ని నిరంతరం పర్యవేక్షించే వీలును ఈ సాంకేతికత కల్పిస్తుంది. యాత్రికుడు నీటి ఏటీయంను వినియోగించుకున్న ప్రతిసారి లీటరు నీటిని బాటిల్లో నింపుకోవచ్చు. గతంలో జరిగిన కుంభమేళాల్లో సంగమంతో సహా ఇతర ఘాట్ల పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి తీవ్రమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సారి కుంభమేళాలో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాతో పాటుగా, పర్యావరణ పరిరక్షణకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

మహాకుంభ్ పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నీటి సరఫరా చేసేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. వాటర్ ఏటీయంలను నిరంతరం పర్యవేక్షించడానికి, సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక సాంకేతిక బృందాలను నియమించారు. అలాగే భవిష్యత్తులో జరిగే కుంభమేళా, ఇతర ధార్మిక ఉత్సవాల్లో శుద్ధమైన తాగునీరు అందించడానికి ఈ తరహా కార్యక్రమాలను అవలంబించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ చొరవ మహాకుంభ్ 2025ను మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా మార్చింది. భవిష్యత్తులో జరిగే ఉత్సవాలకు చారిత్రక ఉదాహరణగా నిలిపింది.

# అన్నవరంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ ఆరవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మేడ్చల్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అన్నవరంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ ఆరవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆంధ్ర ప్రదేశ్ లోని గోదావరి జిల్లా అన్నవరం ఘనంగా జరుపడానికి పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షులు డాక్టర్ శివలింక నాగవ ఉదయలక్ష్మి తెలిపారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై మేడ్చల్ జిల్లా కీసర మండలం శ్రీ రామలింగేశ్వర కాలనీ బ్రాంచ్ కార్యాలయంలో జాతీయ రాష్ట్ర నాయకుల తో కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ అన్ని సామాజిక వర్గాలకు దివ్యాంగులకు బలహీన వర్గాలకు చేయూతనిచ్చే పార్టీ అన్నారు. ప్రతి సభ్యుడు ప్రతి కార్యకర్త ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పార్టీ బలోపేతం చేయాలన్నారు. మాత్య పరిపాలన తో ప్రజలను కన్నబిడ్డలవలే చూసుకుంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేస్తుందని అన్నారు. హిందువుల ఆరాధ్య దైవమైన గోమాతను జాతీయ ప్రాణిగా గుర్తించే వరకు,గోవధ నిషేధించే వరకు అపహారాలను నివారించే వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాటం చేస్తుందని అన్నారు . ఉచిత వైద్యం ఉచిత విద్య జాతీయ స్థాయిలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ కృషి చేస్తుందని ఆమె తెలిపారు. మద్యం పానం వల్ల అనే క కుటుంబాలు సంక్షోభానికి గురవుతున్నాయని అనేకమంది మహిళలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అందుకు మద్యపాన నిషేధం అవసరం అని పేర్కొన్నారు. తమ పార్టీ ఈ అంశానికి ప్రాధాన్యత తీస్తుందని ఉదయలక్ష్మి అన్నారు. అదేవిధంగా వృద్ధాశ్రమాలు, అనాధ ఆశ్రమాల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. పైన తెలిపిన ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పంచ సూత్రాలు అమలు చేసే విధంగా సమాజంలో ప్రజలను జాగ్రత్తలు చేసే విధంగా కార్యవర్గ సభ్యులు కార్యకర్తలు అందరూ పంచ సూత్రాలు చైతన్యం రథంగా చేసుకుని ప్రచారం చేయాలని ఐపిసి ని ముందుకు తీసుకె ళ్లాలని విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షులు కేబీ శ్రీధర్ ఇచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచ సూత్రాల తో ప్రజలందరి ముందుకు వెళ్లాలని ప్రజా బంధువులతో ప్రజాక్షేత్రంలోకి వెళ్లే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ ఆరవ ఆవిర్భావ వేడుకలు అన్నవరంలో తెలుపుతున్నామని ప్రజా ఆశీర్వాదంతో ముందుకు వెళ్తామని అన్నారు. ఈ సమావేశానికి సీనియర్ నాయకురాలు డాక్టర్ అంజనీదేవి గోగి రెడ్డి , ఆవుల అల్లాజీ, శారద, పద్మిని, సుధాకర్, రూప దేవి ఐపిసి సపోర్టర్ విజయ కనకదుర్గ పళ్ళు నాయకులు పాల్గొన్నారు.

## బహుజన సమాఖ్య సంఘటన జాతీయ అధ్యక్షురాలు ప్రీత హరికి ఘన స్వాగతం

హైదరాబాద్ ఫిబ్రవరి 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బహుజనులు రాజకీయ చైతన్యం తీసుకురావడానికి ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ ఇన్కమ్ టాక్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పదవికి రాజీనామా చేసి బహుజన సమైక్య సంఘటన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి దేశవ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తూ బహుజనులలో ఐకమత్యాన్ని రాజకీయ చైతన్యం తీసుకొని వచ్చే విధంగా కృషి చేస్తున్నట్లు ప్రీత హరి తెలిపారు గురువారం హైదరాబాద్ విచ్చేసిన సందర్భంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ ప్రముఖ సామాజికవేత్త గొల్లపల్లి దయానంద్ తదితరులు లకిడికపూలోని శ్రీ వెంకటేశం హోటల్లో ప్రిత హరితను స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా బహుజనలో రాజకీయ చైతన్యం కై ఆమె చేస్తున్న కృషిని కొనియాడారు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరపున చేపట్టే కార్యక్రమాలకు ఆమెను ఆహ్వానించారు ఆమె సానుకూలంగా స్పందించి కుల మత ప్రాంత రాజకీయ పార్టీలకు అతీతంగా బహుజనులలో రాజకీయ చైతన్యం తీసుకొని వచ్చి బహుజనులకు రాజ్యాధికారం వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు.

# అమీన్ పూర్ మున్సిపాలిటీలో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్




సంగారెడ్డి, ఫిబ్రవరి 7: హైడ్రా కమిషనర్ రంగనాథ్ అమీన్ పూర్ మున్సిపాలిటీలో పర్యటించారు. మున్సిపాలిటీలోని ఐలాపూర్ రాజగోపాల్ నగర్, చక్రపురి కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ప్లాట్ల వద్దకు వచ్చి బాధితులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి ప్లాట్ల ఫిజికల్ పొజిషన్ ను పరిశీలించి వారి సమస్యను కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపుతానని బాధితులకు భరోసా ఇచ్చారు.

కాగా, హైడ్రా కమిషనర్ రంగనాథ్, న్యాయవాది ముఖీంకు మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. న్యాయవాది ముఖీంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అతితెలివి చూపవద్దంటూ రంగనాథ్ గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. హైడ్రా లీగాల్టీ గురించి మీరు మాట్లాడనవసరం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు ఏదైనా సమస్య ఉంటే తమకు తెలియజేయాలని కమిషనర్ అన్నారు. రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరువర్గాల వారు చెప్పినది వింటామని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. అలాగే కోర్టు పరిధిలో ఉన్న అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటామని, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. ఇక్కడ కొంతమంది భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నట్లుగా అర్థమవుతుందని కమిషనర్ అన్నారు.

# దంపతుల మధ్య గొడవ .. ఎఆర్ ఎస్ఐ ఆత్మహత్య




ములుగు ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎఆర్ ఎస్ఐ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా గోవిందరావు పేట మండలంలోని పస్రా గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన సువర్ణ పాక లక్ష్మీ నర్సు(36) అనే వ్యక్తి టిజిఎస్పి 15వ బెటాలియన్‌లో ఎఆర్ ఎస్ఐగా పని చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టెవాడకు చెందిన వినోద అనే యువతిని కొన్ని సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకు న్నాడు. గోవిందరావు పేట మండలం రాఘవపట్నం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఆమె సేవలం దిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో లక్ష్మీనర్సు విధులు నిర్వహిస్తున్నారు. గత పది సంవత్సరాల నుంచి దంపతులు పస్రాలో నివాసం ఉంటున్నారు. దంపతుల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతు న్నాయి. ఓ వేడుకకు హాజరై ఇంటికి చేరుకున్న దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్యను ఇంటి నుంచి భర్త బయటకు గెంటేశాడు. ఆమె తన పుట్టినిల్లు హనుమకొండకు వెళ్లిపోయిం ది. గురువారం తెల్లవారుజామున తన భర్తకు భార్య పలుమార్లు ఫోన్ చేసినప్పటికి తీయకపోవడంతో పక్కింటి వారికి పోన్ చేసి సమాచారం ఇచ్చింది. మరో గదిలో నాన్న పడుకు న్నాడని ఇంకా నిద్ర నుంచి మేల్కోలేదని సమాచారం ఇవ్వడంతో పలుమార్లు డోర్ తట్టారు. రూమ్‌లో నుంచి ఎటువంటి స్పందనా లేకపోవడంతో కిటికీ అద్దాలు పగులగొట్టి చూడగా లక్ష్మీనర్సు ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. పక్కింటి వారి సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# కాంగ్రెస్ క్లియర్‌గానే ఉంది.. సీఎం ప్రభుత్వం క్లియర్‌గా లేదు

**-బిసిల కోసం మాట్లాడితే షోకాజ్ నోటీసులు ఇస్తారా?**
**-యుపిఎ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు చేయలేదా?**
**-కులగణనలో ఉన్న వ్యక్తులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తీన్మార్ మల్లన్న డిమాండ్**

హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బిసిల కోసం మాట్లాడితే షోకాజ్ నోటీసులు ఇస్తారా? అని ఎంఎల్ సి తీన్మార్ మల్లన్న ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన షోకాజ్ నోటీసులపై ఎంఎల్ సి తీన్మార్ మల్లన్న అలియాస్ సిహెచ్ నవీన్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించడం తప్పు అంటున్నారని, యుపిఎ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు చేయలేదా? అని ఎదురు ప్రశ్నించారు. కులగణనలో ఉన్న వ్యక్తులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ క్లియర్ గానే ఉందని, రేవంత్ ప్రభుత్వం క్లియర్‌గా లేదని మండిపడ్డారు. కులగణన నివేదికను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. కొందరు నేతలు బిసిలను కాంగ్రెస్ పార్టీకి దూరం చేస్తున్నారని దుయ్యబట్టారు. బిసిలను అణచివేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. షోకాజ్ నోటీసులపై ఈనెల 12లోగా ఆలోచన చేస్తానని, బిసి సమాజంతో మాట్లాడి నోటీసులపై సమాధానం ఇస్తానని తీన్మార్ మల్లన్న వివరణ ఇచ్చారు. బిసి కుల గణన నివేదికపై మల్లన్న వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ఆయనపై టిపిసిసి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేసింది.

# నెలలు ఆలస్యమైనా పర్వాలేదు.. పారదర్శకతతో 'బీసీల కుల గణన సర్వే' చేపట్టాలి..

**- అధికార యంత్రాంగం స్థానిక బీసీ కుల సంఘాల సమన్వయంతో ఇంటింటికి వెళ్ళాలి**
**-అప్పటి వరకూ 'బీసీల ఉద్యమం' ఆపకూడదు.**
**- బీసీ ఆత్మీయ బంధువులకు తట్టే మహేష్ బహిరంగ లేఖ!**

హైదరాబాద్ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెన్ న్యూస్ );బీసీ ఆత్మీయ బంధువులకు జోగులాంబ గద్వాల జిల్లా బి సి సంక్షేమ సంఘం అధ్యక్షులు తట్టే మహేష్ బహిరంగ లేఖ రాశారు. తెలంగాణలో ఇటీవల జరిగిన 'బీసీ కుల గణన సర్వే' తప్పులతడకగా ఉన్న విషయం తెలిసిందే. ఫలితంగా పెద్ద ఎత్తున 'బీసీ కుల గణన యుద్ధం' జరుగుతున్న సంగతి అందరూ చూస్తున్నదే. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న "బీసీ కుల గణన ఉద్యమాలను అణిచివేసేందుకు 'కొందరు పెద్దలు' ప్రయత్నాలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. ఈ ఉద్యమాన్ని పక్కదారి పట్టించేందుకు, ప్రజల దృష్టిని దారిమళ్లించేందుకు రాష్ట్రంలో రకరకాల సంఘటనలను తెరపైకి తీసుకురాబోతున్నారని తట్టే మహేష్ హెచ్చరించారు. అయిందానికి..కాని దానికేమో ఇందిరా పార్క్ లు, స్టేడియాల్లో మీటింగులు.. రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రలు, సైకిల్ యాత్రలు, పాదయాత్రలు చేసిన విషయం తెలిసిందే. అవన్నీ ఒక ఎత్తు అయితే ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు, బీసీలపై అణిచివేతలు ఇప్పటి మరియు రాబోయే కొన్ని తరాలనే కాలరాయనున్నాయి.ఓ రెండు నెలలు ఆలస్యమైనా పర్వాలేదు..అధికార యంత్రాంగం స్థానిక బీసీ మరియు కుల సంఘాల సమన్వయంతో ఇంటింటికీ తిరిగి పారదర్శకతతో 'బీసీల కుల గణన సర్వే' చేపట్టాలి.. అప్పటి వరకూ 'బీసీల ఉద్యమం' ఆపకూడదు. ఉద్యమాన్ని నీరుగార్చే శక్తులు, ఉద్యమ ద్రోహుల గురించి "తెలంగాణ ఉద్యమ తెలంగాణ ముద్దుబిడ్డ బి సి జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు శ్రీ కృష్ణయ్య అన్న ఎంపి " మీకు ఎప్పటి మీ వెంట ఉంటూ తెలంగాణ ఉద్యమానికి వెన్నెముక అయిన తెలంగాణ బీసీ జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఎంపీ .తెలంగాణ భవిష్యత్ తరాల బాగు కోసం మీతో ఉద్యమిస్తారు. ఉద్యమిస్తూనే ఉంటారుఇప్పుడు కాకుంటే..ఎప్పుడూ కాదు..మన యుద్ధం మనమే చేయాలి..ఉద్యమం మనదే..విజయమూ మనదే! అని తట్టే మహేష్ పేర్కొన్నారు.

# గర్భిణిపై లైంగిక వేధింపులు.. కదులుతున్న ట్రైన్ నుంచి తోసేసిన కామాంధుడు

కుప్పం ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); గర్భిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ కామాంధుడు.. కదులుతున్న ట్రైన్ నుంచి ఆమెను తోసేసిన దారుణ సంఘటన తమిళనాడు రాష్ట్రంలోని కేవీ కుప్పం స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. కోయంబత్తూరు, తిరుపతి ఇంటర్ సిటీ ఎక్స్?ప్రెస్ ట్రైన్?లో ఈ ఘటన జరిగింది. చిత్తూరుకు చెందిన ఓ మహిళా గర్భిణి.. ట్రైన్ లో బాత్రూమ్?కి వెళ్లిన సమయంలో హేమరాజ్ అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.అయితే, సదరు మహిళ భయంతో అరుసున్నా.. వేధింపులకు పాల్పడ్డాడు హేమరాజ్. దీంతో ఆమె కేకలేస్తుండటంతో కదులుతున్న రైలు నుంచి తోసేశాడు. తోటి ప్రయాణికులు గమనించిన.. మహిళను కాపాడారు. అయితే, రైలు నుంచి కిందపడటంతో గర్భిణి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం అందించడంతో కాట్పాడి రైల్వే పోలీసులు నిందితుడు హేమరాజ్ ను అరెస్ట్ చేశారు. అతనిపై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు సమాచారం. పస్తుతం సదరు మహిళను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నవీ ముంబయిలో డ్రగ్ సిండికేట్ గుట్టు రట్టు

**-రూ.200 కోట్ల విలువైన వివిధ నిషేధిత పదార్థాలను స్వాధీనం**



ముంబై ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నవీ ముంబలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో.. డ్రగ్ సిండికేట్ గుట్టు రట్టు చేసింది. శుక్రవారం అధికారులు దాడులు చేసిన దాదాపు రూ.200 కోట్ల విలువైన వివిధ నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నలుగురిని అరెస్టు చేసినట్లు ఒక అధికారి తెలిపారు. విదేశాలలో ఉన్న ఓ బృందం ఈ సిండికేట్‌ను నిర్వహిస్తున్నారని చెప్పారు. స్వాధీనం చేసుకున్న కొన్ని మాదకద్రవ్యాలను కొరియర్, చిన్న కార్గో సేవల ద్వారా అమెరికా నుండి నిందితులు ఇక్కడికి తరలించినట్లు తెలిపారు.గత నెలలో ఆస్ట్రేలియాకు పంపాల్సిన పార్శిల్ నుండి 200 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నామని, నవీ ముంబైకి డ్రగ్ మూలాన్ని ట్రాక్ చేయడం ద్వారా సిండికేట్‌ను ఛేదించామని అధికారి వెల్లడించారు.గత వారం నవీ ముంబై నుండి 11.54 కిలోల కొకైన్, హైడ్రోపోనిక్ కలుపు 200 ప్యాకెట్ల(5.5 కిలోలు)ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు.

# తిరుమలలో దంపతుల ఆత్మహత్య



తిరుపతి, ఫిబ్రవరి 7:పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో నందకం అతిథి గృహం నందు శుక్రవారం దంపతులు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తిరుపతికి చెందిన శ్రీనివాసులు నాయుడు (58), ఆయన భార్య అరుణ (55) గురువారం తిరుమలకు వచ్చి నందకం అతిథి గృహంలో బస చేశారు. శ్రీవారి దర్శనానంతరం కాటేజీలో ఉన్నట్లు అక్కడ సిబ్బంది తెలిపారు.

ఉదయం నుంచి కాటేజీ తలుపులు తెరవకపోవడంతో పోలీసుల సహాయంతో కాటేజీ తలుపులను బద్దలు కొట్టడంతో దంపతులు ఇరువురు, ఫ్యాన్లకు ఉరివేసుకొని విగత జీవులైనారు. శ్రీనివాసులు నాయుడు పుత్తూరులో కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణ చేసినట్లు తెలుస్తోంది.

కుటుంబ తగాదాల కారణంగా వీరిరువురు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. టీటీడీ విజిలెన్స్ పోలీసు సిబ్బంది మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టంకు పంపారు. తిరుమల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

# కొత్తగా 'రాజమార్గ యాత్ర', 'ఎన్ హెచ్ఏఐ వన్' పథకాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:జాతీయ రహదారుల ప్రాజెక్టుల అమలు తీరును మెరుగుపరిచేందుకు, పౌరులకు మెరుగైన సౌకర్యాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'రాజ్ మార్గ్ యాత్ర', 'ఎన్ హెచ్ ఏ ఐ వన్' పథకాలను ప్రారంభించింది.

హైవేలపై పౌరులకు మరిన్ని సౌలభ్యాలను అందించేందుకు 'రాజ్ మార్గ్ యాత్ర' మొబైల్ యాప్ ను అభివృద్ధిపరచారు. తాజా సమాచారాన్నీ, ఫిర్యాదుల పరిష్కారాన్ని పర్యవేక్షించడానికి ఈ యాప్ ను వెబ్ ఆధారిత అప్లికేషన్‌తో అనుసంధానించారు. ఇక 'ఎన్ హెచ్ఏఐ వన్' యాప్ హైవే ప్రాజెక్టుల సమర్థవంతమైన నిర్వహణ సహా సకాలంలో ప్రాజెక్టులు పూర్తయ్యేలా వాటి పురోగతిని పర్యవేక్షిస్తుంది. ఈ రెండు యాప్‌లు విభిన్న అవసరాలను తీరుస్తాయి - 'రాజమార్గ్ యాత్ర' ప్రయాణికుల సౌకర్యాలపై దృష్టి సారిస్తే 'ఎన్ హెచ్ఏఐ వన్' హైవే ప్రాజెక్ట్‌ల నిర్వహణను క్రమబద్ధీకరిస్తుంది. వెరసి ఈ రెండు యాప్‌లూ పౌరుల ఫిర్యాదుల పరిష్కారం, ఆన్‌సైట్ ప్రాజెక్ట్ అవసరాలు అనే విభిన్న పద్ధతుల ద్వారా రహదారి రవాణా వ్యవస్థ సామర్థ్య పెంపునకు దోహదపడతాయి.

'రాజ్ మార్గ్ యాత్ర' యాప్ రహదారులపై ప్రయాణించేవారికి సమీపంలోని హైవే టోల్ ప్లాజాలు, పెట్రోల్ పంపులు, ఆసుపత్రులు, ఛార్జింగ్ స్టేషన్‌లు, వాతావరణ అప్‌డేట్‌లు మొదలైన సౌకర్యాల గురించిన సమాచారాన్ని అందిస్తుంది. దరిమిలా పౌరులు అనువైన నిర్ణయాలు తీసుకునేందుకు, తమ ప్రయాణాలను సమర్థంగా ప్లాన్ చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుంది. అంతరాయాల ఊసు లేని టోల్ చెల్లింపుల కోసం ఈ యాప్ ను ఫాస్ట్‌ట్యాగ్ సేవలతో అనుసంధానించారు, అంతేకాక ఈ సేవను అందరికీ అందుబాటులో ఉంచేందుకు సమాచారాన్ని బహుభాషాల్లో అందిస్తున్నారు. సురక్షితమైన డ్రైవింగ్ అలవాట్లను ప్రోత్సహించేందుకు వేగ పరిమితి హెచ్చరికలు, వాయిస్ సేవల సహాయాన్ని పెంచే దిశగా యాప్ కార్యాచరణను అందిస్తుంది. హైవేలు, టోల్ ప్లాజాల నిర్వహణ, గుంతలు, అనధికార ఆక్రమణలు, రాబోయే ముప్పులు మొదలైన వాటికి సంబంధించిన సమస్యలను జియో-ట్యాగింగ్, ఫోటోలు, వీడియోల సాక్ష్యంతో సులభంగా నివేదించేందుకు, ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేసేందుకు, రహదారులకు సంబంధించిన సమస్యల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించేందుకు ఈ వేదిక పౌరులకు సాధికారతను కల్పిస్తుంది.

'ఎన్ హెచ్ ఏ ఐ వన్' మొబైల్ యాప్ ను 'జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ - ఎన్ హెచ్ ఏ ఐ' ఐదు ప్రధాన అంతర్గత కార్యకలాపాల సమ్మేళనంగా భావించవచ్చు.. అవి ? ఫీల్డ్ సిబ్బంది హాజరు సంఖ్య, రహదారుల నిర్వహణ , రహదారి భద్రత గణాంకాలు, మరుగుదొడ్ల పరిశుభ్రత, తనిఖీ అభ్యర్థనల (ఆర్ ఎఫ్ ఐ ) ద్వారా రోజువారీ నిర్మాణ ఆడిట్ లు. 'ఎన్ హెచ్ ఏ ఐ వన్' యాప్‌ను ఆర్వోలు/పీడీలు, రాయితీదారులు/కాంట్రాక్టర్‌లు, ఏఈలు /ఐఈలు, రోడ్డు భద్రత ఆడిటర్లు, టోల్ ప్లాజాల వద్ద టాయిలెట్ సూపర్‌వైజర్లు వంటి అంతర్గత భాగస్వాములు ఉపయోగిస్తున్నారు. 'ఎన్ హెచ్ ఏ ఐ వన్' యాప్ ఆన్‌సైట్ ద్వారా నేరుగా వాటాదారులచే హైవే ప్రాజెక్ట్ నిర్వహణను సులభతరం చేస్తుంది. రెండు యాప్‌ల నుంచీ రికార్డ్ చేయబడిన మొత్తం డేటా జియో-ట్యాగింగ్, టైమ్ స్టాంప్ చేయబడతాయి .

రెండు యాప్‌లు హైవే ప్రయాణికులకు సౌకర్యాన్ని మెరుగుపంచడంలో, జాతీయ రహదారుల ప్రాజెక్టుల అమలు, పర్యవేక్షణలో.. కార్యాచరణ సామర్థ్యాలను మెరుగుపరచడంలో సహాయపడతాయి.

గూగుల్ ప్లే స్టోర్‌లో 3,48,632 డౌన్‌లోడ్లు, 12,000 కి పైగా సమీక్షల ఆధారంగా 'రాజ్ మార్గ్ యాత్ర' యాప్ 4.4-స్టార్ రేటింగ్‌ను దక్కించుకుంది. యాపిల్ స్టోర్‌లో డౌన్‌లోడ్‌లు 74,471 సంఖ్యను చేరుకున్నాయి. 'ఎన్ హెచ్ ఏ ఐ వన్' యాప్ గురించి సగటు వ్యక్తుల అభిప్రాయం సానుకూలంగా ఉంది .

కొంతమంది వినియోగదారులు యాప్ లు క్రాష్ అవుతున్నట్లు, లైవ్ డేటా అప్‌డేట్ చేయడంలో జాప్యం జరుగుతున్నట్లూ తమకు ఎదురైన సాంకేతిక సమస్యల గురించి ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలను సంబంధిత డెవలప్‌మెంట్ టీమ్‌లు తాజా అప్‌డేట్‌లు, సిస్టమ్ ఆప్టిమైజేషన్ ప్రక్రియల ద్వారా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాయి.

వినియోగదారుల నుంచీ అందిన స్పందన ఆధారంగా ఈ రెండు యాప్‌లను నిరంతరం మెరుగుపరుస్తున్నారు. జాతీయ రహదారి ప్రాజెక్టుల అమలును మెరుగుపరిచేందుకు, పౌరులకు మెరుగైన సేవలందించేందుకు ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్‌లను వీటికి జోడిస్తున్నారు.

కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఈరోజు లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానం ద్వారా ఈ సమాచారాన్ని అందించారు.

# 'వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్' సేవలు.. త్వరలో

## దూర ప్రయాణాలు మరింత సౌకర్యవంతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:వేగానికి పెట్టింది పేరైన వందే భారత్ శ్రేణి రైళ్ళ కూటమికి అత్యాధునిక స్లీపర్ ట్రైన్ సెట్ రకాన్ని జోడించడం ద్వారా భారతీయ రైల్వేలు దూర ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా మార్చనున్నాయి. జనవరి 15న 'రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్'-ఆర్డీఎస్ఓ చేపట్టిన కఠిన పరీక్షలను తొలి 16-కోచ్ ల స్లీపర్ ట్రైన్ సెట్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. ముంబై-అహ్మదాబాద్ సెక్షన్లో జరిపిన ప్రయోగాత్మక రన్ లో భాగంగా స్లీపర్ ట్రైన్ సెట్ ఐదు వందల నలభై కిలోమీటర్ల మేర పరుగులు పెట్టింది. దాంతో, ప్రపంచ స్థాయి హై స్పీడ్ స్లీపర్ రైళ్ళ కల త్వరలో నిజమవనుంది. చెన్నై లోని 'ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ'-ఐసీఎఫ్, గత డిసెంబర్లోనే దేశ తొలి వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్ నిర్మాణాన్ని పూర్తి చేసింది. తదుపరి పదిహేను రోజుల్లో ఈ రైలును కోటా డివిజన్ కు తరలించి వరసగా మూడు రోజుల పాటు 30-40 కిలోమీటర్ల మేర పరీక్షలు జరిపారు. గత నెల తొలి వారంలో జరిపిన ఈ ప్రయోగాత్మక రన్ లో భాగంగా కొత్త రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని సులభంగా సాధించింది.

రైల్వేల ఆధునికీకరణలో ఈ విజయం మైలురాయి వంటిది. కొత్త రైళ్ళు ప్రయాణికులకు సుఖవంతమైన, లగ్జరీ అనుభవాన్ని అందిస్తాయి. వివిధ సౌకర్యాలు, మెరుగైన వేగం, అత్యాధునిక సాంకేతికతల వినియోగం ద్వారా సుదూర రాత్రి ప్రయాణాలు చేసే ప్రయాణికులకు ఈ వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్లు కొత్త అనుభూతిని కలిగిస్తాయి.

ఉత్పాదన పెంపు: తదుపరి కార్యాచరణ

నమూనా రైలు సఫల పరీక్షల అనంతరం, రానున్న ఏప్రిల్ డిసెంబర్ మాసాల మధ్య మరో తొమ్మిది వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్లను నిర్మించాలని రైల్వేలు నిర్ణయించాయి. దూర ప్రయాణాలు చేపట్టే వారికి సమర్థవంతమైన, సౌకర్యవంతమైన సేవలను అందించడంలో రైల్వేలు ఇక నూతన ప్రమాణాలను నెలకొల్పనున్నాయి.

24-కోచుల వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్ల నిర్మాణం కోసం గత డిసెంబర్ 17న భారతీయ రైల్వేలు 50 రేక్స్ ల ప్రొపల్షన్ ఎలెక్ట్రిక్స్ భాగాలకు భారీ ఆర్డర్ పెట్టాయి. రెండేళ్ళ కాలంలో పూర్తి కాగలదని భావిస్తున్న ఈ ఆర్డర్ ను రెండు ప్రముఖ కంపెనీలకు అప్పగించారు. వివరాలు:

కొత్త వందే భారత్ రైళ్ళు ఆటోమేటిక్ తలుపులు, సుఖవంతమైన బెర్తులు, వైఫై సౌకర్యం, విమానాన్ని పోలిన అధునాతన డిజైన్ లతో రూపుదిద్దుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా మధ్య స్థాయి, తక్కువ దూరాల మధ్య నడుస్తున్న136 వందే భారత్ రైళ్ళలో ప్రయాణిస్తున్న వారు ఇప్పటికే వెనక్కి వాలే సీట్లు సహా పలు ప్రపంచ స్థాయి సౌకర్యాలను చవి చూస్తున్నారు. ఇక వందే భారత్ స్లీపర్ రైళ్ళలో మరింత నిశ్శబ్దాన్ని, సురక్షితమైన, ప్రపంచస్థాయి సౌకర్యాలతో కూడిన సుఖవంతమైన ప్రయాణాన్ని ఆశించవచ్చు. మేకిన్ ఇండియా పథకంలో భాగంగా చేపట్టిన వందే భారత్ స్లీపర్ రైళ్ళ నిర్మాణం, దేశ ఇంజినీరింగ్ సామర్థ్యానికీ, వినియోగదారులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాలను అందించాలన్న రైల్వేల నిబద్ధతకు అద్దం పడుతోంది.

అత్యాధునిక, సమర్థవంతమైన, అనువైన వ్యవస్థగా నిలవాలన్న రైల్వేల ఆశయానికి వందే భారత్ స్లీపర్ ట్రైన్ సెట్లు ఉదాహరణగా నిలుస్తాయి. విప్లవాత్మతమైన ఈ ప్రాజెక్టుతో భారతీయ రైల్వేలు ముందంజ వేస్తున్నాయి.

దేశ తొలి వందే భారత్ స్లీపర్ రైలుకి పచ్చ జెండా ఊపే ముందు ఆర్డీఎస్ఓ ప్రయోగాత్మక రన్ ను మరోసారి విశ్లేషించి తుది ధ్రువపత్రాన్ని జారీ చేస్తుంది. రైలు అత్యంత వేగ సామర్థ్యాన్ని రైల్వే భద్రతా కమిషనర్ పరిశీలిస్తారు.






# మద్యం కుంభకోణంపై దూకుడు పెంచిన కూటమి ప్రభుత్వం

**- తాజాగా సిట్ బృందంకో ఎక్సైజ్ శాఖ అధికారుల చేర్పు**

అమరావతి, ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై కూటమి ప్రభుత్వం దూకుడు పెంచింది. రెండు రోజుల క్రితం విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు నేతృత్వంలో సిట్ బృందాన్ని ప్రభుత్వం నియమించింది. ఇందులో తాజాగా ఎక్సైజ్ శాఖ అధికారులను కూడా బృందంలో సభ్యులుగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.స్వామినాథన్, ఎ.జనార్ధన్ రావు, ఇన్స్‌పెక్టర్‌లు వైకుంఠరావు, దుర్గా ప్రసాద్, రమేష్, శేషయ్య, శ్రీనుబాబు, రమణలను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది ప్రభుత్వం. వీరందరినీ వెంటనే రిలీవ్ చేసి విజయవాడ సీపీ రాజశేఖర్ బాబుకు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. మద్యం కుంభకోణంపై నియమించిన సిట్ బృందం సీఐడీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాలని.. ప్రతీ 15 రోజులకు ఒకసారి నివేదికను రూపొందించి సీఐడీ చీఫ్ ద్వారా ప్రభుత్వానికి అందించాలని గతంలోనే ఆదేశించిం ది. ఎవరినైనా అరెస్ట్ చేసే అధికారం సిట్‌కు ఉంటుందంటూ వారికి పోలీస్‌స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేసి.. అధికారాలను కట్టబెట్టింది కూటమి ప్రభుత్వం. తాజాగా మద్యం కుంభ కోణంపై విచారించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా అవసరం అవుతారని ప్రభుతవ్ం భావించింది. దీంతో ఎక్సైజ్ అధికారుల సహకారం తీసుకునేందుకు ఆ డిపార్ట్‌మెంట్‌లో కొంతమంది అధికారులను సిట్ బృందంలో నియమించాలని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు ప్రభుత్వానికి వినతి చేశారు.

# అర్వింద్ కేజ్రీవాల్ నివాసం వెలుపల ఎసిబి బృందానికి చుక్కెదురు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అర్వింద్ కేజ్రీవాల్ నివాసం వెలుపల శుక్రవారం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. భారతీయ జనతా పార్టీ (బిజెపి)పై ఆప్ చీఫ్ చేసిన ముడుపుల ఆరోపణలపై ఆయనను ప్రశ్నించేందుకు ఎసిబి బృందం ప్రయత్నించినప్పుడు వారికి ఆయన నివాసంలోపలికి వెళ్లనివ్వలేదు. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు వోట్ల లెక్కింపుజరగడానికి ముందు రోజు ఈ పరిణామం చోటు చేసుకుంది. బిజెపిపై ఆప్ చేసిన 'ఆపరేషన్ లోటస్' ఆరోపణపై దర్యాప్తు నిర్వహించాలని ఎసిబిని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) వికె సక్సేనా ఆదేశించారు. కేజ్రీవాల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక న్యాయవాది ఎసిబికి ఈ చర్య తీసుకునేందుకు అధికారం లేదని స్పష్టం చేశారు.'వారి వద్ద ఎటువంటి పత్రాలూ లేవు. రాజకీయ ప్రహసనం సృష్టికి బిజెపి పన్నిన కుట్ర ఇది' అని ఆయన ఆరోపించరు. పార్టీ ఫిరాయించేందుకు తమ అభ్యర్థులకు బిజెపి రూ. 15 కోట్లు ఇవ్వజూపిందన్న ఆప్ ఆరోపణ ఈ వివాదానికి మూలం. తమ అభ్యర్థుల్లో 16 మందికి పార్టీ మారినట్లయితే ఒక్కొక్కరికి రూ. 15 కోట్లు, మంత్రి పదవులు ఆఫర్ చేశారని ఆప్ అధినేత కేజ్రీవాల్ ఇంతకుముందు ఆరోపించారు. ఆప్ ఆరోపణలపై ఢిల్లీ బిజెపి కార్యదర్శి విష్ణు మిత్తల్ ఫిర్యాదు చేసిన తరువాత ఎల్‌జి ఎసిబి దర్యాప్తునకు ఆదేశించారు. 'అర్వింద్ కేజ్రావాల్, సంజయ్ సింగ్ చేసిన ఆరోపణలు ఎంతో తీవ్రమైనవి. తక్షణ దర్యాప్తు జరిపించవలసినవి' అని మిత్తల్ ఎల్‌జి సక్సేనాకు రాసిన లేఖలో వ్యాఖ్యానించారు. ఆప్ నేతలు తమ ఆరోపణల ధ్రువీకరణకు ఎటువంటి రుజువులూ లేదా ఆధారాలూ చూపలేదని మిత్తల్ తెలిపారు.'

# ఐసిడిఎస్ సిబ్బంది అంగన్వాడీ టీచర్ల విధుల్లో నిర్లక్ష్యం వస్తే కఠిన చర్యలు తప్పవు.

**-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**
**-ఎవరికి అప్పగించిన బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలి.**
**-ఐసిడిఎస్ సూపర్వైజర్లు సిడిపిఓ లతో కలెక్టర్ సమీక్ష.**



సంగారెడ్డి, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి):అంగన్వాడి సూపర్వైజర్లు సిడిపివోలు టీచర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను హెచ్చరించారు.

గురువారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సిడిపివోలు అంగన్వాడీ సూపర్వైజర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమెఅధికారులను ఉద్దేశించి మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ భవనాల నిర్మాణం, టాయిలెట్స్ పనులు త్వరగా పూర్తి చేయాలి.

టాయిలెట్స్ కు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలి ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో మిషన్ భగీరథ త్రాగునీరు ఇబ్బందులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. కరెంట్ మీటర్ల కనెక్షన్లు ఏర్పాటుకై ఎంపీడీవోలు పంచాయతీ సెక్రటరీతో సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలని సిడిపిఓ లకు సూపర్వైజర్లకు సూచించారు.

అంగన్వాడి సూపర్వైజర్లు సిడిపిఓలు ప్రతిరోజు విధిగా తమ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు జిల్లాలో అంగన్వాడీ సూపర్వైజర్లు సిడిపివోలు తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇకమీదట అలాంటి సంఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవని అన్నారు నారాయణఖేడ్ మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో జరిగిన సంఘటన జిల్లాలో మరి ఎక్కడ జరగకుండా అధికారులు అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు . సుదిలాస్తులు ఉన్న భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలను సురక్షితమైన భవనాలకు తరలించాలన్నారు. అంగన్వాడి సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని అంగన్వాడీ సిబ్బంది ఏఎన్ఎం, ఆశా వర్కర్లు కలిసి గ్రామంలో నిర్వహించాల్సిన సమావేశాలు, విధులను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఎవరికి అప్పగించని బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో బాలింతలు గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు సరైన పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పోషణ అభియాన్ టీములను ఆదేశించారు.

అంగన్వాడి కేంద్రాల్లో నిర్ణీత సమయానికి, క్రమం తప్పకుండా తల్లిదండ్రులు సమావేశాలు నిర్వహించాలని ఈ సమావేశాలకు సూపర్వైజర్లు, సిడిపిఓ స్థాయి అధికారులు క్రమం తప్పకుండా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐసిడిఎస్ సిబ్బంది వారి విధులను బాధ్యతలను తప్పకుండా నిర్వర్తించాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి లలిత కుమారి, జెడ్పి సీఈవో జానకి రెడ్డి, డిపిఓ సాయి బాబా, ఈఈ పి ఆర్ జగదీష్, మిషన్ భగీరథ ఈఈ పాష, సంబంధిత శాఖల అధికారులు, జిల్లాలోని సిడిపివోలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా పాల్గొననున్న 5 కోట్ల మందితో పీపీసీ 2025 సరికొత్త రికార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్న పరీక్షా పే చర్చ 2025 (పీపీసీ 2025) కార్యక్రమం ఫిబ్రవరి 10 న ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ సంభాషిస్తారు. పరీక్షలకు సన్నద్ధం కావడం, ఒత్తిడిని ఎదుర్కోవడం, వ్యక్తిగత వృద్ధికి సంబంధించిన అంశాలపై తన ఆలోచనలను పంచుకుంటారు.

ఈ ఏడాది రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 36 మంది విద్యార్థులను ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొనేందుకు ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ పాఠశాలలు, ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలు, సీబీఎస్ఈ, నవోదయ విద్యాలయాల నుంచి వారిని ఎంపిక చేశారు. వారిలో కొందరు ప్రేరణ పాఠశాల కార్యక్రమం పూర్వ విద్యార్థులు, కళా ఉత్సవ్, వీర్ గాథ విజేతలు సైతం ఉన్నారు. వీరు ప్రధానమంత్రితో ప్రత్యక్షంగా సంభాషిస్తారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం భారతదేశ వైవిధ్యానికి, సంఘటితత్వానికి ప్రతిరూపంగా నిలవనుంది.

ఈ ఏడాది పీపీసీ 2025 కొత్త రూపును సంతరించుకొంది. దీనిలో భాగంగా ఎనిమిది ధారావాహికలను ప్రసారం చేస్తారు. మొదటి ఎపిసోడ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సంభాషణను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. దేశవ్యాప్తంగా ఎక్కువ మంది ఈ కార్యక్రమంలో పాల్గొనేలా దూరదర్శన్, స్వయం, స్వయం ప్రభ, పీఎంఓ యూట్యూబ్ ఛానల్, విద్యా మంత్రిత్వ శాఖ, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సామాజిక మాధ్యమ ఛానళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

ఇప్పుడు పీపీసీ జన చైతన్యం కలిగించే కార్యక్రమంగా మారడంతో చిన్నారుల శారీరక, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను నిపుణుల సాయంతో పరిష్కరిస్తున్నారు. దీని ప్రకారం, పీపీసీ 2025లో ఏడు ధారావాహికల్లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమ అనుభవాలను, జ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకుంటారు. జీవితం, అభ్యాసాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను వారికి వివరిస్తారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనే విద్యార్థులను అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన వివిధ విద్యాసంస్థలు, జాతీయ స్థాయి పాఠశాల పోటీల ద్వారా ఎంపిక చేశారు. ఈ ధారావాహికల్లో ప్రధానంగా దృష్టి సారించే అంశాలు:

క్రీడలు, క్రమశిక్షణ: లక్ష్య నిర్దేశం, నిలకడగా ఉండటం, క్రమశిక్షణ ద్వారా ఒత్తిడిని ఎదుర్కోవడం గురించి ఎంసీ మేరీ కోమ్, అవనీ లేఖరా, సుహాస్ యతిరాజ్ మాట్లాడతారు.

మానసిక ఆరోగ్యం: మానసిక సంక్షేమం, స్వీయ వ్యక్తీకరణ ప్రాధాన్యం గురించి దీపికా పదుకొణే చర్చిస్తారు.

పోషకాహారం: చదువులో రాణించేందుకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, నాణ్యమైన నిద్ర ప్రాధాన్యం గురించి సోనాలి సబ్రేవాల్, రుజుతా దివేకర్ వివరిస్తారు. ఫుడ్ ఫార్మర్‌గా ప్రసిద్ధికెక్కిన రేవంత్ హిమత్‌సింగ్కా ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి వివరిస్తారు.

సాంకేతికత, ఆర్థికం: మెరుగైన విద్యాభ్యాసం, ఆర్థిక అంశాలపై అవగాహనకు టెక్నాలజీ వినియోగాన్ని గౌరవ్ చౌధరి(టెక్నికల్ గురూజీ), రాధికా గుప్తా వివరిస్తారు.

సృజనాత్మకత, సానుకూల దృక్పథం: ప్రతికూల ఆలోచనలు విడిచిపెట్టి, సానుకూల మనస్తత్వాన్ని పెంపొందించుకొనేలా విక్రాంత్ మాసే, భూమి ఫెడ్నేకర్ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతారు.

ధ్యానం, మానసిక ప్రశాంతత: విద్యార్థుల్లో మానసిక స్పష్టత, ఏకాగ్రతను పెంచేందుకు ధ్యానానికి సంబంధించిన ఆచరణాత్మక చిట్కాలను సద్గురు పంచుకుంటారు.

విజయగాథలు: యూపీఎస్సీ, ఐఐటీ-జేఈఈ, క్లాట్, సీబీఎస్ఈ, ఎన్‌డీఏ, ఐసీఎస్ఈ తదితర పరీక్షల్లో టాపర్లుగా నిలిచినవారు, గతంలో జరిగిన పీపీసీ కార్యక్రమంలో పాల్గొన్నవారు పరీక్షా పే చర్చ పరీక్షలకు సన్నద్ధమవడంలో వారిని ఎలా ప్రభావితం చేసిందో వివరిస్తారు.

2018లో ప్రారంభమైననాటి నుంచి పరీక్షా పే చర్చ జాతీయ స్థాయి ఉద్యమంగా రూపాంతరం చెందింది. ఈ ఏడాది చేపడుతున్న ఈ కార్యక్రమం గత ఎడిషన్ల రికార్డులు బద్దలు కొడుతోంది. 5 కోట్ల మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొననుండటంతో మరింత ప్రభావవంతంగా మారనుంది.

అన్ని నేపథ్యాలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా విద్యా మంత్రిత్వశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. యువ మేధను ప్రోత్సహించి, చదువులో విజయం, వ్యక్తిగతంగా వృద్ధి సాధించే పరివర్తనాత్మక కార్యక్రమంగా పరీక్షా పే చర్చను మార్చింది.

తాజా సమాచారం, కార్యక్రమ వివరాలు, ప్రత్యేక సమాచారం కోసం విద్యా మంత్రిత్వ శాఖ, సమాచార, ప్రసార శాఖ సామాజిక మాధ్యమ ఖాతాలను అనుసరించండి.

# ఈ నెల 24 నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

అమరావతి, ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ఈ నెల 24 నుంచి జరుగనున్నాయి. 24న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. దాదాపు మూడు వారాల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సెలవులతో కలుపుకుని 20 రోజుల పాటు సభ నిర్వహించే యోచనలో ఉన్నట్లు సమాచారం. మొదటి రోజు బీఏసీ తర్వాత సభ ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈనెల 28న శుక్రవారం 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను సభలో ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాలకు మంత్రులు తమ శాఖల్లో అడిగిన ప్రశ్నలకు పూర్తిస్థాయి సబ్జెక్టుతో హాజరుకావాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి.

# పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ అకౌంట్ (పీఓఎస్ఏ)లతో ఖాతాల అనుసంధానాన్ని సులభతరం చేసేందుకు చర్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ)కు దేశవ్యాప్తంగా 650 శాఖలు, 1.63 లక్షలకు పైగా సేవా కేంద్రాలు (యాక్సిస్ పాయింట్లు) ఉన్నాయి. ఖుషీనగర్ జిల్లాలో ఒక శాఖతో పాటు 224 సేవా కేంద్రాలు ఉన్నాయి.

పొదుపు, కరెంటు ఖాతాలు, వర్చువల్ డెబిట్ కార్డులు, దేశీయంగా నగదు బదిలీ సేవలు, బిల్లు, యుటిలిటీ చెల్లింపులు, ఐపీపీబీ వినియోగదారులకు బీమా సేవలు, ఐపీపీబీ ఖాతాతో పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ అకౌంట్ (పీఓఎస్ఏ) అనుసంధానం, పోస్టాఫీసు పొదుపు పథకాలకు ఆన్ లైన్ చెల్లింపులు, డిజిటల్ జీవన ధ్రువీకరణ పత్రం (డీఎల్‌సీ), ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఏఈపీఎస్), పౌరుల ఆధార్‌లో మొబైల్ నెంబర్ అప్డేట్ చేయడం, 0-5 ఏళ్ల పిల్లలకు ఆధార్ నమోదు తదితర సేవలను ఐపీపీబీ అందిస్తోంది.

ఐపీపీబీ ఖాతాలతో పోస్ట్ ఆఫీసు సేవింగ్స్ అకౌంట్ (పీవోఎస్ఏ) అనుసంధానాన్ని సులభతరం చేయడానికి అవసరమైన చర్యలను ఐపీపీబీ చేపట్టింది. దీంతో పాటుగా అన్ని ప్రధాన తపాలా కార్యాలయాల్లో వినియోగదారుల్లో అవగాహన పెంపొందించే కర పత్రాలను ప్రదర్శిస్తోంది. అలాగే తపాలా కార్యాలయాల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ వినియోగదారుల్లో ఆర్థికపరమైన అవగాహనను పెంచేందుకు 25000కు శిబిరాలను నిర్వహించింది. తద్వారా పీఓఎస్ఏ-ఐపీపీబీ ఖాతాలను అనుసంధానించేలా వినియోగదారులను ప్రోత్సహించింది.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్, చైల్డ్ ఎన్రోల్మెంట్ లాంటి ఆధార్ సంబంధిత సేవలను తపాలా బంట్రోతు, గ్రామీణ డాక్ సేవక్‌ల ద్వారా ఇంటి వద్దే ఐపీపీబీ అందజేస్తోంది. ఈ సేవలను సామాన్యులకు, ఫించనుదారులకు, చిన్నారులకు అందించేందుకు కేంద్ర/రాష్ట్ర స్థాయిల్లో వివిధ విభాగాలతో ఒప్పందం కుదుర్చుకుంది. 31.12.2024 వరకు 7.03 కోట్ల ఆధార్ సీడెడ్ బ్యాంకు ఖాతాలు తెరిచారు. 7.68 కోట్ల మంది వినియోగదారులు ఆధార్లో మొబైల్ నంబర్లను అప్డేట్ చేశారు. 81.17 లక్షల మంది వినియోగదారులు చిన్నారుల ఆధార్ నమోదు సేవలను వినియోగించుకున్నారు. ఫించనుదారులకు 24 లక్షల డిజిటల్ జీవన ధ్రువీకరణ పత్రాలను జారీ చేసింది.

ఈ రోజు రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు బదులుగా కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ఈ సమాచారాన్ని లిఖితపూర్వకంగా అందించారు.

# ఢిల్లీ ఎన్నికల ఫలితాలకు ఒకరోజు ముందు ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. మహారాష్ట్రలో ఓటర్ల జాబితాలో ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు. ఐదు నెలల కాలంలో 39 లక్షల మంది కొత్త ఓటర్లు నమోదయ్యారన్నారు. మహారాష్ట్రలో బీజేపీ విజయానికి ఇదే కారణమన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఓటర్ల జాబితాలో ఎన్నో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఓటు కోసం నమోదుచేసుకున్నవారి సంఖ్య కంటే ఎక్కువమందిని ఎన్నికల సంఘం చూపిస్తోందన్నారు. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాపై తాము అధ్యయనం చేశామని, ఎన్నో అవకతవకలు బయటపడ్డాయన్నారు. ఎన్సీపీ(శరద్ పవార్), శివసేన(ఉద్ధవ్) పార్టీ నేతలతో కలిసి రాహుల్ గాంధీ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో నమోదు చేసుకున్న ఓటర్లతో పోలిస్తే ఎన్నికల సంఘం ప్రకటించిన జాబితా ఎక్కువగా ఉందన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై తాము ఎన్నికల సంఘానికి ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం స్పందించి మహారాష్ట్రలో ఓటర్ల జాబితాలో అక్రమాలపై పారదర్శకంగా విచారణ చేయాలన్నారు.

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు జరిగిన తర్వాత భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు నమోదయ్యారన్నారు. లోక్‌సభ ఎన్నికలు జరిగిన ఐదు నెలలకు శాసనసభ ఎన్నికలు జరగ్గా.. ఈ ఐదు నెలల్లో మహారాష్ట్రలో 39 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారన్నారు. 2019 విధానసభ ఎన్నికల తర్వాత నుంచి 2024 లోక్‌సభ ఎన్నికల వరకు 32 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదుకాగా.. కేవలం ఐదు నెలల్లో 39 లక్షల మంది ఓటర్లు నమోదు కావడం ఏమిటని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిచిన నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్త ఓటర్లు అధికంగా నమోదయ్యారన్నారు. కేవలం ఇండియా కూటమిని ఓడించడానికి బీజేపీ ఎన్నికల సంఘం సహాయంతో సరికొత్త కుట్రకు తెరలేపిందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఇదే వ్యూహాన్ని బీజేపీ అమలు చేస్తోందన్నారు. భారీ సంఖ్యలో ఓటర్ల నమోదు వెనుక కుట్రదాగి ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

మహారాష్ట్రలో గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుచుకున్న ఇండియా కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసింది. తాజాగా మహారాష్ట్రలో ఎన్నికల జాబితాలో అవకతవకలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలకు ఒకరోజు ముందు రాహుల్ ఈ వ్యాఖ్యలు చేయడం ఆసక్తి రేపుతోంది. ఇండియా కూటమి ఆరోపణలపై బీజేపీ ఎలా స్పందిస్తుందనేది వేచి చూడాలి.

# లారీని ఢీకొన్న కారు - ఇద్దరు దుర్మరణం



సిద్దిపేట, ఫిబ్రవరి 7: జిల్లా గజ్వేల్ రింగ్‌రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు సమీపంలో రాజీవ్ రహదారిపై అతివేగంగా దూసుకొచ్చిన కారు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది.దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలుచేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు.కారు గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకున్నదని పోలీసులు తెలిపారు. మృతులను గోదావరిఖనికి చెందిన దినేశ్ (28), లింగం (48)గా గుర్తించారు. డ్రైవర్ ప్రణయ్‌కి తీవ్రంగా గాయాలయ్యాయని, అతడిని చికిత్స నిమిత్తం గజ్వేల్ దావాఖానకు తరలించామన్నారు. ప్రమాదం ధాటికి కారు ముందుకుభాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చంద్రబాబు నాయుడితో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బృందం బేరి

అమరావతి, ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూ )బి:: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బేరి నేతృత్వంలోని బృందం సమావేశమైంది. భేటీ కోసం శుక్రవారం ఉదయం సచివాలయానికి చేరుకుంది నీతి ఆయోగ్ బృందం. ఈ సందర్భంగా సుమన్ బేరీ నేతృత్వంలోని నీతి ఆయోగ్ ప్రతినిధి బృందానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావులతో నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ భేటీ అవనున్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వికసిత్ ఏపీ - 2047 విజన్ డాక్యుమెంట్‌పై చర్చించనున్నారు. ఏపీలో అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై భేటీలో చంద్రబాబు, పయ్యావుల చర్చించనున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు నీతి ఆయోగ్ ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే 16వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ పనగారియాను సీఎం చంద్రబాబు, పయ్యావుల కలిసిన విషయం తెలిసిందే.నీతి ఆయోగ్ ప్రతినిధి బృందంలో కీలక బృందం ఈరోజు ఏపీకి వచ్చారు. ఏ.ముత్తు కుమార్ ఐఏఎస్, పార్థసారథి రెడ్డి ఐఏఎస్. కె. కిషోర్ భేటీలో పాల్గొన్నారు. అలాగే నీతిఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ ఈ భేటీకి ప్రాతినిధ్యం వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వికసిత్ ఏపీ-2047 విజన్ డాక్యుమెంట్‌పై ప్రధానంగా చర్చించనున్నారు. ఏపీకి ఉన్న అప్పులు వాటితో పాటు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమావేశంలో చర్చ జరుగనుంది. రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితిని వారికి వివరించనున్నారు. 16వ ఫైనాన్స్ కమిషన్‌ను కూడా కలిసిన నేపథ్యంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రప్పించుకోవడంతో పాటు పన్నుల్లో వాటా, వివిధ కేంద్ర ప్రయోజిత పథకాల్లో రావాల్సిన వాటాలపైన రాష్ట్రం తీసుకుంటున్న చర్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై వీరి భేటీలో సుదీర్ఘంగా చర్చ జరిగే అవకాశం ఉంది.

# దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల బలోపేతంపై మేం దృష్టి సారించాం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:పార్లమెంటు సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం మీద చర్చ అనంతరం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు రాజ్యసభలో సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా దేశం సాధించిన విజయాలు, భారత్‌పై ప్రపంచం అంచనాలు, వికసిత భారత్ సంకల్ప సాకారంలో సామాన్యుల ఆత్మవిశ్వాసంవగైరాలను రాష్ట్రపతి ప్రసంగం విశదీకరించిందని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ఎంతో స్ఫూర్తిదాయకం, ప్రభావవంతమైన ఈ ప్రసంగం భవిష్యత్ కార్యాచరణకు మార్గనిర్దేశం చేసేదిగా ఉందని అభివర్ణించారు. ఇంతటి ఉత్తేజకర ప్రసంగం చేసినందుకుగాను రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపారు.

సభలో 70 మందికిపైగా గౌరవనీయ ఎంపీలు ఈ చర్చలో పాల్గొని, తమ విలువైన అభిప్రాయాలతో ధన్యవాద తీర్మానాన్ని అర్థవంతం చేశారని శ్రీ మోదీ పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్షాలు రెండింటి వైపునుంచి మాట్లాడిన ప్రతి సభ్యుడూ తమ అవగాహన మేరకు రాష్ట్రపతి ప్రసంగాన్ని విశ్లేషించారని చెప్పారు. ముఖ్యంగా 'అందరి సహకారంతో.. అందరి ప్రగతి' (సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్)పై విస్తృతంగా ప్రసంగించినప్పటికీ అందులోని సంక్లిష్టతలను అవగతం చేసుకోవడం కష్టమని ప్రధాని వ్యాఖ్యానించారు. అయితే, 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' అన్నది మనందరి సమష్టి బాధ్యతని, ప్రజలు దేశ సేవచేసే అవకాశం ఇచ్చింది అందుకేనని స్పష్టం చేశారు.

దేశ ప్రజానీకం 2014 నుంచి వరుసగా మూడోసారి తమకు సేవచేసే అవకాశం ఇవ్వడంపై ధన్యవాదాలు తెలిపారు. దేశ ప్రజలు తమ అభివృద్ధి విధానాలను అర్థం చేసుకుని, పరీక్షించి, మద్దతిస్తున్నారనడానికి ఇది నిదర్శనమని శ్రీ మోదీ విశ్లేషించారు. 'దేశమే ప్రధానం' అన్న పదబంధమే తమ అభివృద్ధి నమూనాను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు, పథకాలు, కార్యాచరణతో ఇది మరింత స్పష్టమవుతున్నదని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 5-6 దశాబ్దాల సుదీర్ఘ విరామానంతరం ప్రత్యామ్నాయ ప్రభుత్వం, పాలన యంత్రాంగ నమూనా అవసరాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. తదనుగుణంగా 2014 నుంచి బుజ్జగింపుల ప్రాతిపదికన కాకుండా సంతృప్తి లక్ష్యంగా సాగే పాలనలోని సరికొత్త అభివృద్ధి నమూనాను గమనించే అవకాశం ప్రజలకు కలిగిందని శ్రీ మోదీ అన్నారు.

''దేశంలో వనరుల గరిష్ఠ సద్వినియోగానికి భరోసా దిశగా మేం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. అలాగే జాతి ప్రగతికి, ప్రజల సంక్షేమానికి దేశం తన సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అవశ్యమని పేర్కొన్నారు. అందుకే, "మేం సంతృప్త విధానాన్ని అనుసరిస్తున్నాం" అని వివరించారు. ప్రతి పథకం అమలులో అర్హులైన వాస్తవ లబ్ధిదారులకు 100 శాతం ప్రయోజనంపై భరోసా ఇవ్వడమే ఈ విధానం ధ్యేయమని తెలిపారు. తదనుగుణంగా గడచిన దశాబ్ద కాలంలో "సబ్ కా సాథ్.. సబ్ కా విశ్వాస్" వాస్తవ స్ఫూర్తిని క్షేత్రస్థాయిలో ఆచరించి చూపామని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఆ కృషి ఫలితం నేడు ప్రగతి, పురోగమనం రూపేణా మన కళ్లముందు కనిపిస్తున్నదని చెప్పారు. కాబట్టే- "సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. మా పాలనకు తారక మంత్రం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానిం చారు. పేదలు, గిరిజనుల ఆత్మగౌర వం, భద్రత ఇనుమడించేలా ఎస్సీ- ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించడంలో ప్రభుత్వం తన నిబద్ధతను ప్రదర్శించిందని ప్రధాని స్పష్టం చేశారు.

దేశంలో కులతత్వ విషబీజాలు నాటేందుకు ఇటీవలి కాలంలో చాలా ప్రయత్నాలు సాగుతున్నాయని ప్రధానమంత్రి ఆందోళన వెలిబుచ్చారు. 'ఒబిసి' కమిషన్‌కు రాజ్యాంగ హోదా కోసం వివిధ పార్టీల్లోని ఆ వర్గాల ఎంపీలు మూడు దశాబ్దాలుగా పార్లమెంటు ఉభయసభల్లో డిమాండ్ చేస్తూ వచ్చారని గుర్తుచేశారు. అయితే, వారి ఆకాంక్షను నెరవేర్చింది తమ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. దేశంలోని 140 కోట్ల మంది భారతీయులను ఆరాధించే తమ ప్రభుత్వానికి వెనుకబడిన తరగతుల గౌరవప్రతిష్ఠలు కూడా ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

దేశంలో రిజర్వేషన్ అంశం తలెత్తిన ఏ సందర్భంలోనూ ఆ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేసిన జాడ లేదని శ్రీ మోదీ గుర్తుచేశారు. అలాంటి క్లిష్ట పరిస్థితి ఏర్పడినపుడల్లా దేశంలో విభజన తెచ్చి, ఉద్రిక్తతల సృష్టితో జనం పరస్పర శత్రువుల్లా వ్యవహరించేలా కుయుక్తులు పన్నారని వివరించారు. చివరకు స్వాతంత్ర్యం తర్వాత కూడా ఇలాంటి విధానాలే అనుసరించారని పేర్కొన్నారు. అయితే, 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రం స్ఫూర్తితో తమ ప్రభుత్వం తొలిసారి ఒక నమూనాను రూపొందించిందని, ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా ఆర్థిక బలహీన వర్గాలకు దాదాపు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిందని ప్రధానమంత్రి చెప్పారు. ఈ నిర్ణయంపై ఏ ఒక్క వర్గమూ అసంతృప్తి వెలిబుచ్చలేదని, ఎస్సీ/ఎస్టీ, ఓబీసీ వర్గాలు హర్షం ప్రకటించాయని గుర్తు చేశారు. ఆ మేరకు 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' సూత్రం ప్రాతిపదికన ఆరోగ్యకర, శాంతియుత పద్ధతిలో పరిష్కారం చూపిన ఈ నిర్ణయాన్ని యావద్దేశం ఆమోదించిందని ప్రధాని తెలిపారు.

దేశంలోని దివ్యాంగులు లేదా విభిన్న వైకల్యాలున్న వ్యక్తులపై ప్రభుత్వాలు తగినంత శ్రద్ధ చూపలేదని శ్రీ మోదీ పేర్కొన్నారు. అయితే, తమ ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' తారక మంత్రంగా వారికి రిజర్వేషన్లను వర్తింపజేసిందని తెలిపారు. అంతేకాకుండా వారికి అనువైన సౌకర్యాల కల్పనకు ఉద్యమ స్థాయిలో కృషి చేసిందని పేర్కొన్నారు. విభిన్న వైకల్యాలుగల వారి ప్రయోజనం దిశగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని చెప్పారు. మరో వైపు చట్టపరంగానూ బలమైన చర్యలతో వారి హక్కులకు భరోసా ఇవ్వడంలో నిబద్ధత చూపిందన్నారు. ముఖ్యంగా లింగమార్పిడి వ్యక్తుల సామాజిక హక్కుల రక్షణ దిశగా చిత్తశుద్ధి చూపిందని శ్రీ మోదీ వివరించారు. సమాజంలోని అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి కరుణార్ద్ర దృక్పథంలో చర్యలు తీసుకోవడం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' విధానాన్ని స్పష్టం చేస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు.

"భారత పురోగమనానికి నారీశక్తి సారథ్యం వహిస్తోంది" అని శ్రీ మోదీ అభివర్ణించారు. మహిళలకు అవకాశాలు కల్పించడం ద్వారా విధాన రూపకల్పనలో వారు భాగస్వాములైతే దేశ ప్రగతి వేగం పుంజుకోగలదని ఆయన స్పష్టం చేశారు. అందుకే నారీశక్తిని గౌరవిస్తూ కొత్త పార్లమెంటు భవనంలో ప్రభుత్వం తీసుకున్న తొలి నిర్ణయాన్ని వారికి అంకితమిచ్చామని వ్యాఖ్యానించారు.

భవనం రూపురేఖల రీత్యా మాత్రమేగాక నారీ శక్తికి నివాళిగా తొలి నిర్ణయం తీసుకోవడం వల్ల కూడా కొత్త పార్లమెంటు సౌధం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. కేవలం ప్రశంసల కోసమే అయితే, కొత్త భవన ప్రారంభోత్సవం మరోవిధంగా నిర్వహించి ఉండవచ్చునని, అందుకు బదులుగా ఆ కార్యక్రమాన్ని మహిళల గౌరవానికి అంకితం చేశామని వివరించారు. ఆ మేరకు నారీశక్తి ఆశీర్వాదంతో కొత్త పార్లమెంటు తన కార్యకలాపాలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు.

గత ప్రభుత్వాలు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ఏనాడూ 'భారత రత్న' పురస్కారానికి అర్హుడుగా పరిగణించలేదని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. కానీ, దేశ ప్రజలు మాత్రం ఆయన స్ఫూర్తిని, ఆదర్శాలను సదా గౌరవిస్తూనే ఉన్నారని చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల నుంచి ఆయనకు లభిస్తున్న ఈ గౌరవమర్యాదల ఫలితంగా అన్ని పార్టీలలో ప్రతి ఒక్కరూ నేడు అయిష్టంగానే "జై భీమ్" అనక తప్పడంలేదన్నారు.

దేశంలోని ఎస్సీ/ఎస్టీ వర్గాల ప్రాథమిక సవాళ్లను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లోతుగా అర్థం చేసుకున్నారని శ్రీ మోదీ తెలిపారు. ఆ బాధలు, వేదనలను ఆయన స్వయంగా అనుభవించడమే ఇందుకు కారణమన్నారు. కాబట్టే, ఆ వర్గాల ఆర్థిక అభ్యున్నతికి ఆయన సుస్పష్ట భవిష్యత్ ప్రణాళికను రూపొందించారని గుర్తుచేశారు. "భారత్ వ్యవసాయాధారిత దేశమే అయినా వ్యవసాయం ఒక్కటే దళితులకు ప్రధాన జీవనాధారం కాజాలదు" అన్న డాక్టర్ అంబేద్కర్ వ్యాఖ్యను ప్రధాని ఉటంకించారు. ఇందుకు ఆయన రెండు కారణాలు చూపారని పేర్కొన్నారు. అందులో మొదటిది- భూమి కొనుగోలు చేయలేని ఆర్థిక దుస్థితి... రెండోది- ఒకవేళ డబ్బు ఉన్నా భూమి కొనుగోలుకు అవకాశాలు లేకపోవడమని ప్రధాని వివరించారు. ఈ నేపథ్యంలో దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న ఈ అన్యాయానికి పరిష్కారంగా పారిశ్రామికీకరణను డాక్టర్ అంబేద్కర్ సమర్థించారని ఆయన వెల్లడించారు. ఆర్థిక స్వావలంబన దిశగా నైపుణ్యాధారిత ఉద్యోగాలు, కుటీర పరిశ్రమల స్థాపన వంటి వాటిని ప్రోత్సహించడాన్ని అంబేద్కర్ సూచించేవారని చెప్పారు. కానీ, స్వాతంత్ర్యం తర్వాత అనేక దశాబ్దాలపాటు ఆయన దూరదృష్టిని ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోకపోగా, పూర్తిగా తోసిపుచ్చినట్లు తెలిపారు. అయితే, ఎస్సీ/ఎస్టీ వర్గాల ఆర్థిక కష్టనష్టాల తొలగింపుపై డాక్టర్ అంబేద్కర్ లక్ష్యనిర్దేశం చేసుకున్నారని చెప్పారు.

2014లో తమ ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సమ్మిళితం, పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చిందని ప్రస్తావించిన ప్రధానమంత్రి, సమాజ పునాదులుగా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న సంప్రదాయ చేతివృత్తులవారు, కమ్మరి, కుమ్మరులు వంటి చేతివృత్తుల వారిని లక్ష్యంగా చేసుకుని పీఎం విశ్వకర్మ యోజనను ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. సమాజంలోని ఈ వర్గానికి తొలిసారిగా శిక్షణ, సాంకేతిక నవీకరణలు, కొత్త పరికరాలు, డిజైన్ల తయారీలో సాయం, ఆర్థిక సహాయం, మార్కెట్ లభ్యత వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు. నిర్లక్ష్యానికి గురైన ఈ సమూహంపై దృష్టి పెట్టడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించిందని, సమాజ నిర్మాణంలో వారి ముఖ్యమైన పాత్రను గుర్తించిందని ఆయన చెప్పారు.

# పుష్పాలంకరణ వేడుకలో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్

ఖమ్మం, ఫిబ్రవరి 7 (నేటినిజం ప్రతినిధి) : సింగరేణి మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన చల్లా వీరయ్య-కవిత దంపతుల కూతుర్లు ఇందుశ్రీ, సంజనశ్రీ లకు కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో పుష్పాలంకరణ వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. తదనంతరం కొంతమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ప్రతి పేదవాడికి 6 గ్యారంటీల పథకం తప్పక అమలు జరుగుతుందని, ఈ దిశగా కాంగ్రెస్ పార్టీ చొరవ తీసుకొని గ్యాస్ సబ్సిడీ, ఫ్రీ కరెంటు, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం, రేషన్ కార్డులు పంపిణీ, రైతుబంధు, ముఖ్యంగా ప్రతి పేదవాడికి ఇల్లు కట్టించాలని ధృఢ లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని, నాడు 40 సంవత్సరాల క్రితం, 15సంవత్సరాల క్రితం,



తిరిగి నేడు ఇల్లు కట్టించే ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీలకు డిపాజిట్ కూడా దక్కకుండా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చల్లా వీరయ్య, చల్ల కవిత, చల్లా రామ్మూర్తి, చల్ల నాగేశ్వరరావు, చల్లా వెంకటయ్య, చల్లా శ్రీనివాస్, పల్లపు ప్రతాప్, పల్లపు ప్రసాద్, చల్లా గోపి, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కామేశ్వర్ చౌపాల్ మృతికి ప్రధానమంత్రి సంతాపం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:శ్రీ కామేశ్వర్ చౌపాల్ మృతికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సంతాపం తెలిపారు. రామునికే జీవనాన్ని అంకితం చేసిన భక్తుల్లో శ్రీ కామేశ్వర్ చౌపాల్ ఒకరు, అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి చాలా విలువైన తోడ్పాటును ఆయన అందించారంటూ ప్రధాని ప్రశంసించారు.

"బీజేపీ సీనియర్ నేతలలో ఒకరు, రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ధర్మకర్త కామేశ్వర్ చౌపాల్ జీ మన మధ్య లేరని విని దు:ఖం కలిగింది. అనన్య రామభక్తుల్లో ఆయన ఒకరు. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి చాలా విలువైన తోడ్పాటును అందించారు. దళిత నేపథ్యం నుంచి వచ్చిన కామేశ్వర్ జీ, సమాజంలో వంచనకు గురైన సముదాయాల వారి శ్రేయాన్ని దృష్టిలో పెట్టుకొని చేసిన పనుల కారణంగా ఆయనను సదా స్మరించుకొంటూ ఉంటాం.


ఆహ్వానం

43వ వార్షికోత్సవ శుభాకాంక్షలతో
సాధనసాహితీ స్రవంతి హైదరాబాద్
శ్రీచిమ్మపూడి శ్రీరామమూర్తి గారి దర్శకత్వంలో
"భామినీ భువన విజయం" సాహిత్యరూపకం
(విద్యార్థినులచే)
సమర్పణ : చిమ్మపూడి ఫౌండేషన్



వేదిక : భారత్ వికాస్ పరిషత్ సత్సంగ్ హాల్
నాగార్జున స్కూల్ ప్రక్కన
రామాలయం రోడ్, రోడ్ నం.3
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్

తేది : 09-02-2025
ఆదివారం
ఉ॥ గం॥ 10.00 లకు

ముఖ్య అతిథి : డా॥ కె. వి. రమణాచారి గారు ఐ.ఎ.ఎస్(రి)
అధ్యక్షులు : శ్రీ సి.హెచ్. హనుమంతరావు గారు చైర్మన్, వివేకానంద సేవాసమితి
సత్కారం : శ్రీ అశ్వినీ సుబ్బారావు గారు చైర్మన్, అశ్వినీ చారిటబుల్ ట్రస్ట్
ఆత్మీయ అతిథులు : ప్రముఖ సాహితీవేత్త డా॥ ఎన్. అనంతలక్ష్మి గారు
అభినవ తెనాలి రామకృష్ణ శ్రీ మావుడూరు సూర్యనారాయణ మూర్తి గారు

సాహితీ మిత్రులందరికి ఇదే ఆహ్వానం

శంభుని కుమార్ కార్యదర్శి
సాధన నరసింహాచార్య అధ్యక్షుడు

# ఒమన్‌లో శ్రీ రాజరాజేశ్వర స్వామి కళ్యాణం

-పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పూజలు



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 7:(నేటినిజం ప్రతినిధి): మస్కట్ దేశంలోని బర్క సిటీ ఒమన్ లో తెలంగాణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

ఈ మహోత్సవంలో ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు పాల్గొని, స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకొని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం తొలిసారిగా మస్కట్‌లో జరగడం ఆనందదాయకం అని, భక్తుల కోర్కెలు తీర్చే స్వామివారి కృప అందరికీ ఉండాలని, దేశ విదేశాల్లో ఉన్న భక్తులకు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు.

# కాంగ్రెస్ మాటతప్పదు... మడమతిప్పదు: పరికపల్లి

ఖమ్మం, ఫిబ్రవరి 7 (నేటినిజం ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన నిటారుగా నిలబడుతుందని హస్తం పేదల నేస్తం అని మాట తప్పడం మడమ తిప్పడం కాంగ్రెస్ పార్టీలో లేదని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన కొనిజర్ల మండల కేంద్రంలో మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు పేదలకు ప్రయోజనకరంగా ఉంటున్నాయని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంతో నిరుపేదలు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం చేసుకునే అవకాశం ఉందన్నారు. నిరుపేదలకు నిలువ నీడ ఏర్పాటు చేసేందుకు ఇందిరమ్మ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతన్నలు రుణమాఫీ పథకంతో రుణ విముక్తి పొందారని తెలిపారు. రైతు భరోసా పథకంతో రైతన్నలకు సకాలంలో పెట్టుబడి సాయం అందడంతో పాటు అప్పుల పాలు కాకుండా ఉందన్నారు.

# త్యాగమూర్తి మాత రమాబాయి మహిళలకు ఆదర్శమూర్తి

- మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేత



ఖమ్మం, ఫిబ్రవరి 7 (నేటినిజం ప్రతినిధి) : మాత రమాబాయి అంబేద్కర్ మహిళలకు ఆదర్శమూర్తి అని మహిళ ప్రాంగణపు అధికారి వేల్పుల విజేత కొనియాడారు. శుక్రవారం వీరనారీమణుల ఆశయ సాధన సమితి కార్యాలయ ఆవరణలో మాత రమాబాయి జయంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. వీరనారి మణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో మాత రమాబాయి జయంతిని పురస్కరించుకొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రమాబాయి సేవలను కొనియాడారు. మాత రమాబాయి తో పాటు ఇతర వీర నారి మణుల చిత్రపటాలకు కూడా పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేత మాట్లాడుతూ....తన భర్త డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా మారే ప్రక్రియలో నిరంతరం ప్రోత్సాహం అందించిన రమాబాయి ధన్యజీవురాలని పేర్కొన్నారు. తన జీవితంలో అత్యధిక సంతానాన్ని కోల్పోయిన, నిరంతరం పేదరికం అనుభవిస్తూ కూడా తన భర్త అంబేద్కర్ ఉన్నతికి అనుక్షణం పాటుపడిన రమాబాయి జీవితం నుండి మనం ఎంతో పూర్తి పొందాల్సిన అవసరం ఉందన్నారు. వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ సీఐ పొల్లూరు నాగయ్య, తెలంగాణ ఉద్యమకారుడు పాలకుర్తి కృష్ణ, వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి, లీగల్ అడ్వైజర్ షేక్ నజీమా, జిల్లా ఉపాధ్యక్షురాలు త్రివేణి, కార్యదర్శి స్పందన, సహాయ కార్యదర్శి కృష్ణవేణి నాయకులు విజయ, ఝాన్సీ, నాగమణి, నాగేంద్ర, సంధ్య, సుభద్ర, భవాని, కవిత, సుశీల, లక్ష్మి, లలిత, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు రవీంద్ర నాయక్, అఖిల్, రామ్మూర్తి, నాగేశ్వరావు, సంజీవరావు, జగదీష్, గాయకుడు ఫక్రుద్దీన్, రావుల వెంకట్, ప్రకాష్, వీరన్న తదితరులున్నారు.

# నామినేషన్ దాఖిలు చేసిన బిజెపి గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి....

-విద్యావంతుల, పట్టభద్రుల హక్కుల కోసం పోరాడుతా.. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా....

-బిజెపి గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి....



కరీంనగర్, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్, ఆదిలాబాద్ , నిజామాబాద్ , మెదక్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీబిజెపి అభ్యర్థి అంజిరెడ్డి శుక్రవారంరోజున కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి , జిల్లా కలెక్టర్ పమేల సత్పతి కి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా నిరుద్యోగులు, పట్టభద్రులు గత బి ఆర్ ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి మోసపూరిత వాగ్దానాలకు బలయ్యారన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పన పేరుతో రెండు పార్టీలు నిరుద్యోగ పట్టభద్రులకు తీవ్ర నష్టం చేశాయని తెలిపారు. ఎన్నికల సందర్భంగా తాత్కాలిక హామీలతో ఆకర్షించి రెండు పార్టీలు పట్టభద్రులను తీవ్రంగా మోసగించాయన్నారు. ఈ ఎన్నికలు విద్యావంతులైన ఓటర్లకే కాకుండా రాష్ట్ర భవిష్యత్తు కూడా కీలకమన్నారు. ఎందుకంటే ఏడాది కింద ప్రతి నెల నిరుద్యోగ భృతి ప్రతి నెల రూ.4000 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ , నేటికీ ఏ ఒక్కరికి ఇవ్వలేదని , నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ కు ఈ ఎన్నికల్లో ఓట్లు వేస్తే నిరుద్యోగ పట్టబద్రులు ఉజ్వల భవిష్యత్తును నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే నిరుద్యోగ పట్టభద్రులకు లోగడ జరిగిన అనుభవాలను, నష్టాలను దృష్టిలో ఉంచుకొని, కాంగ్రెస్ బిఆర్ఎస్ ల మోసాలను గ్రహించి , బిజెపికి ఈ ఎన్నికల్లో ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. విద్యావంతుల, పట్టభద్రుల గొంతుకనై వారి సమస్యల పరిష్కారం కృషి చేస్తానని , బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మొదటి ప్రాధాన్యత ఓటుతో తనను గెలిపించి అంజిరెడ్డి ఈ సందర్భంగా కోరారు. ఇట్టి కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ నాంపల్లి శ్రీనివాస్, వైద రామానుజనీ, గాజుల స్వప్న, మామిడి చైతన్య , నాగసముద్రం ప్రవీణ్, ఉప్పరపల్లి శ్రీనివాస్, ఈసంపల్లి మహేష్ ,రాగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే న్యాయవాదుల సమస్యల పరిష్కారం

-అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు కు కృషి

-పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి



కరీంనగర్, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి) న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలో పలువురు పట్టభద్రులను న్యాయవాదులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల చిరకాల వాంఛ అయిన అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు తన వంతుగా కృషి చేస్తానని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అద్భుతంగా ముందుకు వెళ్తుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 55 వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు. నాలుగు నెలల ఎమ్మెల్సీ పర్యటనలో చాలా సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటన్నిటిని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత తనపై ఉందని గుర్తు చేశారు. లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఒకటో తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తుందని గుర్తు చేశారు. తాను రాజకీయాలు చేయడానికి ఎమ్మెల్సీగా పోటీ చేయడం లేదని కేవలం నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెల్లడించారు.

# గల్ఫ్ మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

-ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా థామస్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 7:(నేటినిజం ప్రతినిధి): దుబాయ్ లో చనిపోయిన వేములవాడ పట్టణంలోనితిప్పాపూర్ వాసి గుడిసె మల్లేశం కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా థామస్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 రోజుల క్రితం దుబాయిలో గుడిసె మల్లేశం బతుకు తెరువు కోసం దుబాయ్ వెళ్ళాడని, అక్కడ అతడు లేబర్ పని చేస్తుండగా మట్టి కూలి చనిపోయాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు తల్లిదండ్రులు ఉన్నారని అన్నారు. కూతురు వికలాంగురాలని, కుమారుడు, కూతురు చదువుకుంటున్నారన్నారు. పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభుత్వం నుండి సహకారం అందించాలని కోరారు. ఎవరైనా కుటుంబానికి సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మ్యకల జీవన్, మ్యాకల సంతోష్, ల్యాగల వరప్రసాద్ ఉన్నారు.

# భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను ప్రపంచానికి చాటి చెప్పాలి

-ప్రకృతిలోనే జీవించాలి .. ప్రకృతిని సంరక్షించుకోవాలి

-పర్యావరణ పరిరక్షణ దైవతో సమానం

- ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి పిలుపు



యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారత మాజీ రాష్ట్రపతి ప్రముఖ పర్యావరణ తత్వవేత్త భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను విద్యార్థుల్లోకానికి ప్రపంచానికి చాటి చెప్పాలని ఏకైక లక్ష్యంతో ప్రపంచ పర్యావరణ సంస్థ పర్యావరణ పరిరక్షణ కోసం పని చేస్తూ ఉందన్నారు.ప్రతి ఒక్కరం మన దైనందిన జీవితంలో ప్రకృతి కోసం జీవించాలి ప్రకృతిలోనే జీవించాలి ప్రకృతిని సంరక్షించుకోవాలి అని ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి పిలుపునిచ్చారు.ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర మరియు ప్రధాన కార్యదర్శి కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి మరియు ప్రపంచ పర్యావరణ సంస్థ ఉపాధ్యక్షులు కార్యక్రమ నిర్వహకులు మిట్టపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో హెచ్ ఎండ్ ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సి ఎస్ ఆర్ నిధులతో యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖ్ గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల చేత పర్యావరణ ప్రతిజ్ఞ చేపించి వారితో మొక్కలు నాటించారు. ప్రపంచ పర్యావరణ సంస్థ స్కూల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఏ జోష్ణ రావు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం మీద విద్యార్థి లోకం గళం విప్పాలి భవిష్యత్తు తరాలకి మంచి ఆహారాన్ని మంచి ఆరోగ్యాన్ని విద్యను అందించాలంటే పర్యావరణాన్ని పరిరక్షించినప్పుడే సాధ్యమవుతుందన్నారు. అనంతరం హెచ్ ఎండ్ ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంస్థ ప్రతినిధులు హరీష్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వివిధ పాఠశాలల్లో వివిధ కళాశాలలో వివిధ గ్రామాలలో సి ఎస్ ఆర్ నిధులతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది కానీ వాటి అన్నిటికీ భిన్నంగా ప్రపంచ పర్యావరణ సంస్థ కేవలం ఒక్కరోజు కార్యక్రమం నిర్వహించడం ప్రతిరోజు ప్రతి విద్యార్థికి పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడం చాలా గొప్ప కార్యక్రమంగా మా సంస్థ భావిస్తుందన్నారు.అనంతరం ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ భద్ర మాట్లాడుతూ రోజుకు సగటున దేశంలో ఆరు నుంచి 20వేల మంది వివిధ రకాల కాలుష్యం వాయు కాలుష్యం జల కాలుష్యం భూమి కాలుష్యం ధ్వని కాలుష్యం మూలంగా చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు తెలుపుతున్నాయి, ముఖ్యంగా భారతదేశం లాంటి మన అత్యధిక జనాభా ఉన్న దేశంలో ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం మూలంగా అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా దయానంద రావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో ఉన్న ఆనందం ఉన్నతృప్తి ప్రపంచంలో మరి ఎక్కడ దొరకదు అన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ సంస్థ ఈచ్ వన్ టీచ్ వన్ ప్లాంట్ వన్ కార్యక్రమాన్ని 12 సంవత్సరాల క్రితం ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ కోశాధికారి భారత ప్రభుత్వం ఆహార పంపిణీ సలహా మండలి సభ్యులు రిజ్వాన్ అహ్మద్ మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం భూతం నుంచి జీవజాతిని మానవజాతిని సంరక్షించుకోకపోతే మన జీవితాన్ని ప్రతిరోజు కూడా మనం డబ్బులు ఇచ్చి జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ సహాయ కార్యదర్శి రాజేష్ గౌడ్ ఉపాధ్యక్షుడు ఆర్ వినోద్ రెడ్డి రామకృష్ణ శంకర్ ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల హెచ్ఎం నాగభూషణం చారి గారు మరియు పాఠశాల కళాశాల లెక్చరర్లు ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణాన్ని పరిరక్షిస్తామని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి హృదయం మీద చేయి వేసి పవిత్ర హృదయంతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈరోజు నుంచి ప్రతిరోజు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రపంచ పర్యావరణ సంస్థ ఉద్యమంలో భాగస్వామ్యం అవుతామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతుల ప్రధాన మహోత్సవం నిర్వహించారు విజేతలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి మెమోరియల్ అవార్డుతో సర్టిఫికెట్ తో సత్కరించడం జరిగింది

# రాష్ట్రపతితో సుప్రసిద్ధ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:దిగ్గజ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండుల్కర్ ఈ రోజు (ఫిబ్రవరి 6 న) తమ కుటుంబ సభ్యులతో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్మును కలుసుకున్నారు. అనంతరం శ్రీమతి ముర్ము, శ్రీ టెండుల్కర్ అమృత్ ఉద్యాన్ ని సందర్శించారు.'రాష్ట్రపతి భవన్ విమర్శ శృంఖల' ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా శ్రీ టెండుల్కర్... తన క్రికెట్ ప్రస్థానంలో ఎదురైన అనేక అనుభవాల ఆధారంగా స్ఫూర్తిని అందించే అంశాలను పంచుకున్నారు.

ఔత్సాహిక క్రీడాకారులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులూ పాల్గొన్న ఈ కార్యక్రమంలో బృంద స్ఫూర్తి, ఇతరుల సంక్షేమం పట్ల దృష్టి సారించడం, ఇతరుల విజయాల్లో పాలుపంచుకోవడం, కఠోర పరిశ్రమ, శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించుకోవలసిన అవసరం తదితర అనేక జీవిత సోపానాల గురించి శ్రీ టెండుల్కర్ వివరించారు. భవిష్యత్తులో దేశం మారుమూల ప్రాంతాల నుంచీ, గిరిజన సమూహాల నుంచీ, వెనుకబడిన ప్రాంతాల నుంచీ గొప్ప క్రీడాకారులు వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

# నమ్మకం తిరిగి వచ్చింది.. క్రిటికల్ హార్ట్ సర్జరీ తర్వాత హైదరాబాద్ కి చెందిన 72 ఏళ్ల రోగికి ప్రాణాపాయం తప్పింది



హైదరాబాద్, ఫిబ్రవరి 7:కార్డియాక్ కేర్ లో ఇది ఒక పురోగతి, తీవ్రమైన అరోటిక్ వాల్వ్ స్టెనోసిస్ మరియు బహుళ ప్రాణాపాయ కారకాలు ఉన్న 72 ఏళ్ల రోగికి కోయడం లేకుండా ట్రాన్స్కాథెటర్ అరోటిక్ వాల్వ్ రీప్లేస్మెంట్ (టిఎవిఆర్) ప్రక్రియ ద్వారా చికిత్స చేశారు. హైదరాబాద్ లోని ప్రఖ్యాత ఆసుపత్రి అయిన సిటిజన్స్ హాస్పిటల్ లో సీనియర్ కన్సల్టెంట్ - ఇంటర్వెన్షనల్ కార్డియాల జిస్ట్ మరియు హార్ట్ ఫెయిల్యూర్ స్పెషలిస్ట్ డాక్టర్ సుధీర్ కోగంటి ఆధ్వర్యంలో ఇది నిర్వహించారు. ఈ ప్రక్రియ భారతదేశం అంతటా అడ్వాన్స్డ్ గుండె చికిత్సల అవసరాన్ని హైలైట్ చేస్తుంది. చాలా కాలం నుంచి కాలు వాపెక్కడం, డయాలసిస్ చేయాల్సిన అవసరం ఉన్న కిడ్నీ ఫెయిల్యూర్ మరియు గుండె సరిగ్గా పని చేయకపోవడంతో బాధపడుతున్న రోగిని సాధారణ ఓపెన్-హార్ట్ సర్జరీ చేయడం కష్టమని నిర్ణయించారు. ఏదేమైనా, కోయడంతో చేసే సర్జరీ లేకుండా అరోటిక్ వాల్వ్ ను మార్చే టిఎవిఆర్ ప్రక్రియ దీనికి మంచి పరిష్కారాన్ని అందించింది. సర్జరీ చేసిన నాలుగు రోజుల తరువాత, రోగిని డిశ్చార్జ్ కూడా చేశారు, ఆ తర్వాత రెండు నెలల్లో, అతని గుండె మరియు కిడ్నీ పనితీరు చాలా బాగా మెరుగుపడింది, ఇది మంచి జీవితాన్ని గడపడానికి వీలు కల్పించింది. స్ట్రక్చరల్ హార్ట్ వ్యాధులు గురించి వివరిస్తూ డాక్టర్ సుధీర్ కోగంటి మాట్లాడుతూ, స్ట్రక్చరల్ హార్ట్ వ్యాధులు అనేవి, ముఖ్యంగా వాల్వ్ లకు సంబంధించిన గుండె జబ్బులు భారతదేశంలో ఒక పెద్ద ఆరోగ్య సమస్యగా ఉన్నాయి. రుమాటిక్ హార్ట్ వ్యాధి, మిట్రల్ స్టెనోసిస్, అరోటిక్ వాల్వ్ స్టెనోసిస్ మరియు రెగ్యురిటేషన్ అత్యంత సాధారణ పరిస్థితులలో ఉన్నాయి. స్ట్రక్చరల్ హార్ట్ వ్యాధులు ప్రధానంగా గుండె నిర్మాణాన్ని ప్రభావితం చేస్తాయి కాబట్టి, అధిక కచ్చితత్వంతో ఎకోకార్డియోగ్రఫీ ద్వారా సులభంగా గుర్తించవచ్చు. 3 డి ఎకోకార్డియోగ్రఫీ, కార్డియాక్ సిటి మరియు కార్డియాక్ ఎంఆర్ఐ వంటి వాటి ద్వారా ఈ పరిస్థితులను గుర్తించడానికి మరియు చికిత్సలను ప్లాన్ చేయడానికి ఇంకాస్త ఎక్కువ సామర్థ్యాన్ని పెంచింది. ఈ పరికరాలు ఇప్పుడు చాలా ఎక్కువగా అందుబాటులో ఉన్నాయి, చిన్న పట్టణాలలో కూడా ఉన్నాయి, ఖచ్చితమైన డయాగ్నోసిస్ కోసం రోగులు ఇకపై మెట్రో నగరాలకు ప్రయాణించాల్సిన అవసరం కూడా లేదు. అరోటిక్ వాల్వ్ స్టెనోసిస్ చికిత్సలో, ముఖ్యంగా వృద్ధులు లేదా అధిక-ప్రమాద రోగులకు టిఎవిఆర్ ఒక వరంగా మారింది. సాధారణ సర్జరీలో ఎక్కువ రికవరీ సమయం అవసరం ఉంటుంది మరియు కోమార్బిడిటీస్ ఉన్న రోగులకు అధిక ప్రమాదాలను కలిగిస్తుంది, కానీ టిఎవిఆర్ వేగంగా కోలుకోవడంతో పాటు ఛాతీ మచ్చలు లేకుండా తక్కువగా కోయడం ఉండే ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది.

# వైసీపీ మాజీ ఎంపీకి షాక్.. ఆస్తులను జప్తు చేసిన ఈడీ

అమరావతి, ఫిబ్రవరి 7:వైసీపీ నేత విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు ఈడీ షాక్ ఇచ్చింది. సత్యనారాయణకు చెందిన ఆస్తులను జప్తు చేసినట్లు ఈడీ ప్రకటించింది. హయగ్రీవ ఫామ్స్ కు చెందిన 44.74 కోట్ల ఆస్తులను ఈడీ అధికారలు సీజ్ చేశారు. ఈ భూముల అమ్మకాల్లో ఎంవీవీ, ఆయన ఆడిటర్ జీవీ, మేనేజింగ్ పార్ట్ నర్ గద్దె బ్రహాజీలు సూత్రధారులుగా తేల్చింది.

ఎంవీవీ బిల్డర్, హయగ్రీవైన్ ఫ్లాటెక్ ప్రాజెక్ట్స్, గద్దె బ్రహ్మాజీ, ఆయన భార్య చిలుకూరి జగదీశ్వరుడు, రాధారాణి ఆస్తులు అటాచ్ చేసిన వాటిలో ఉన్నాయి.

అనాథలు, వృద్ధులకు సేవ చేసేందుకు కేటాయించిన హయగ్రీవ ప్రాజెక్టుకు చెందిన 12.51 ఎకరాల భూములను వీరు ఆక్రమించుకున్నారని ఈడీ నిర్ధారించింది.

హయగ్రీవ ఫామ్స్ లోని ప్లాట్‌లను విక్రయించి సుమారు రూ.150 కోట్లు ఆర్జించారి ఈడీ తెలిపింది.

గత ఏడాది జూన్ 22న చిలుకూరు జగదీశ్వరుడు, అతని భార్య రాధారాణి ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. గతేడాది అక్టోబర్‌లో ఎంవీవీ, జీవీల ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. చివరకు ఎంవీవీ ఆస్తులను జప్తు చేసింది.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి వి నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు

కరీంనగర్, ఫిబ్రవరి 7: (నేటినిజం ప్రతినిధి) రాబోవు ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డి శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి కరీంనగర్ కలెక్టరేట్ లో నామినేషన్ దాఖలు వేశారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో టికెట్ కేటాయించిన కాంగ్రెస్ అధిష్టానానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యువేట్ ఎమ్మెల్సీగా భారీ మెజారిటీతో గెలిచి సీఎం రేవంత్ రెడ్డి, సోనియాగాంధీకి గిఫ్ట్ ఇస్తానని, కాంగ్రెస్ నమ్మకాన్ని నిలబెడతానని చెప్పారు. ఫిబ్రవరి 10వ తేదీన రెండో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నానని తెలిపారు. అనతి కాలంలోనే కాంగ్రెస్ నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించిందని కొనియాడారు. పార్టీ పథకాలతోపాటుగా నరేంద్రుడి నవరత్నాలు పేరిట మేనిఫెస్టోతో పట్టభద్రుల వద్దకు చేరుకోబోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డితో పాటు ఆయన కుటుంబీకులు, సన్నిహితులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.